

▼ చిన్నారి (ఫైల్)



అంతులేని విషాదం

● అమ్మ.. నాన్నను మింగిన అప్పులు ● ఆకలి దప్పులతో ప్రాణం విడిచిన చిన్నారి

చిన్న జీవితం. అమ్మ, నాన్న.. ఐదు నెలల క్రితమే పుట్టిన పసిపాప. చాలా సంతోషంగా గడిపేవారు. కానీ నాన్నకు మోయలేనంత అప్పుల భారం ఉన్నింది. నాన్నమ్మకు, నాన్నకు వైద్యం చేయించేందుకు పెట్టిన ఖర్చులు అవి. వడ్డీతో కలిపి ఏకంగా రూ.50 లక్షలు దాటాయి. ఉన్నదేమో పాత మిద్దె. తిప్పి కొడితే రూ.15 లక్షలు చేయదు. ఉపాధి కోసం చిన్నపాటి మెడికల్ షాపు. రోజుకు ఐదారు వందల వ్యాపారం కూడా బరువే. అప్పులు లేకుంటే.. ఉన్నంతలో హాయిగా గడిపేవారు. కానీ అవి వెంటాడాయి. వేటాడాయి. అమ్మ, నాన్న ఉరి వేసుకునేదాకా..! తనకు ఏమీ తెలియదు. ఊయలలో పడుకుంది. నిద్రలేవగానే ముద్దాడే నాన్న, ముర్రి పాలు తాపించే అమ్మ పలకరించలేదు. పాప ఎంతగా ఏడ్చిందో..! ఎవ్వరికీ వినిపించలేదు. అలా ఎన్ని రోజులు గడిచాయో తెలియదు. పాప ఆకలి దప్పులతో కన్నుమూసి.. అమ్మానాన్నలను వెతుక్కుంటూ అనంత లోకాలకు వెళ్లిపోయింది. ఎంతటి విషాదం..! పేదరికం ఎంతటి శాపమో కదా..! పాపా.. ఈసారి అమ్మానాన్నలతో కలిసి.. బాగా అయినవారింట పుట్టు తల్లీ..! ఏ కష్టమూ లేకుండా.. నిండు నూరేళ్లు వర్ధిల్లేలా..!

- ఆంధ్రజ్యోతి నార్పల


(వివరాలు మెయిన్‌లో..)



ఉరికి వేలాడుతున్న కృష్ణకిషోర్ దంపతులు, పక్కనే ఊయలలో చిన్నారి మృతదేహం

పట్టా.. ఫట్!

ఎక్కడ చూసినా నకిలీ పట్టాలు



ఉప్పరపల్లి 194-8లోని నకిలీ పట్టా

అనంతపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పేదలు గుడిసెలు వేసుకుంటే చాలు.. గద్దల్లా వాలిపోతున్నారు. పట్టాలు ఇప్పిస్తామని మాయ మాటలు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారు. స్థలం సొంతమౌతుందని ఆశించేవారికి గాలం వేస్తున్నారు. నకిలీ పట్టాలు చేతిలో పెట్టి.. అందినకాటికి దోచుకుంటున్నారు. నగరం చుట్టుపక్కల, రూరల్ మండలంలో ఇంటి పట్టాల ముసుగులో రూ.లక్షల దందా నడుస్తోంది. డబ్బులు ఇచ్చినవారికి నకిలీ పట్టాలు చేతిలో పెట్టేస్తున్నారు. కొంత మంది ఇదే పనిగా పెట్టుకున్నారు. పేదలు నిజం తెలుసుకునేలోపు పట్టాలు ఇచ్చినవారు మయామైపోతున్నారు.

- గుడిసెలు వేసుకున్న వారికి బురిడీ
- గతంలో పనిచేసిన అధికారుల సంతకాలు ఫోర్జరీ
- పట్టాకు రూ.5 వేల నుంచి రూ.30 వేలు వసూలు
- మాయగాళ్లలో రాజకీయ, కుల సంఘాల నాయకులు



ఇటీవల దళిత సంఘం నాయకుడిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పత్రం

భారీగా నకిలీ పట్టాలు

అనంతపురం అర్బన్, రూరల్ మండలాల పరిధిలోనే వందల సంఖ్యలో నకిలీ పట్టాలు ఉన్నాయని తమ దృష్టికి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అనంతపురం నగరంతోపాటు, నగర శివారు ప్రాంతాలైన నారాయణపురం, రుద్రంపేట, రాజీవ్‌కాలనీ తదితర ప్రాంతాల్లో నకిలీ పట్టాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక రూరల్ మండలంలో నకిలీ పట్టాలకు కొదవే లేదు. ప్రతి గ్రామంలోనూ బయట పడుతున్నాయని రెవెన్యూ వర్గాలు అంటున్నాయి. ఉప్పరపల్లి, కురుగుంట, కొడిమి, కక్కలపల్లి, సోములదొడ్డి తదితర ప్రాంతాల్లో ఎక్కువగా నకిలీ పట్టాలు బయట పడుతున్నాయని అంటున్నారు.

● అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి సర్వే నంబరు 194-8లో నకిలీ పట్టా ఇచ్చారు. ఈ సర్వే నంబరులో కొందరు పేదలు ఎనిమిది తొమ్మిది నెలల క్రితం నుంచి గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. వారికి పెద్దగా వ్యవహరిస్తున్న ఓ దళిత నాయకుడు 28-09-2018లో అప్పటి అధికారి అన్వర్ హుస్సేన్ సంతకాలు చేసినట్లుగా దాదాపు 189 పట్టాలు సృష్టించాడు. గుడిసెలు వేసుకున్న వారి నుంచి ఒక్కొక్క పట్టాకు రూ.5వేలు వసూలు చేశాడు. అవి నకిలీవి. ఒరిజినల్ పట్టాలు కావాలంటే మరో రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో నకిలీ పట్టాలు తీసుకుని మోసపోయినవారు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎనిమిది తొమ్మిది నెలల క్రితం గుడిసెలు వేసుకుంటే.. 2018 నాటి తేదీలతో పట్టాలు సృష్టించి ఇచ్చాడు. ఈ గుడిసెలు ఇటీవల పండమేర వరద నీటిలో మునిగాయి. బాధితులు తీవ్రంగా నష్టపోయారు.

● ఉప్పరపల్లి గ్రామ సర్వే నంబరు 215లో అదే ఊరికి చెందిన వైసీపీ నాయకుడు పట్టాలు సృష్టించి, వేల రుపాయాలు వసూలు చేశాడు. ఆ పట్టాలు పెట్టి ఇంటి గుత్తలు కూడా మంజూరు చేయించాడు. అవి కూడా 2018లో ఇచ్చిన పట్టాలే కావడం గమనార్హం. అప్పట్లో టీడీపీ అధికారంలో ఉన్నింది. అప్పటి టీడీపీ నాయకులు పట్టాలు ఇవ్వాలని నాటి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. వంక పోరంబోకు స్థలాలు కావడంతో పట్టాలు ఇవ్వడానికి వీలుండదని సర్దిచెప్పారు. వైసీపీ అధికారంలోకి అవే స్థలాలకు ఆ పార్టీ నాయకులు నకిలీ పట్టాలు సృష్టించి ఇచ్చేశారు.

● కక్కలపల్లి సర్వే నంబరు 248-2ఎ, 2బి, 2సిలోని నాగరాజు కొట్టాలలో నకిలీ పట్టాల దందా జరుగుతోంది. ఇద్దరు స్థానికులు నకిలీ పట్టాలు సృష్టించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ కాలనీలో కూడా పదుల సంఖ్యలో దొంగ పట్టాలు బయటకు వచ్చినట్లు రెవెన్యూ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఉప్పరపల్లి, కక్కలపల్లి ప్రాంతాల్లోనే కాదు.. కురుగుంట మటన్ మార్కెట్, వైఎస్సార్ కాలనీ, సోములదొడ్డి, కక్కలపల్లి కాలనీ, కొడిమి తదితర ప్రాంతాల్లో నకిలీ పట్టాలు భారీగా ఉన్నాయని సమాచారం.

పాత అధికారుల పేరిట పట్టాలు

తహసీల్దార్ కార్యాలయాల్లో గతంలో పని చేసి, రిటైర్డ్ అయిన మరో మండలానికి బదిలీ అయిన తహసీల్దార్ల పేరిట నకిలీ పట్టాలు పుట్టుకొస్తున్నాయి. అనంతపురం తహసీల్దార్ కార్యాలయంలో గతంలో పని చేసిన అధికారుల పేరిట పట్టాలు బయటకు వస్తున్నాయి. వీటిలో కొన్ని సంబంధిత అధికారులే చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం బయట పడుతున్న వాటిలో ఎక్కువ శాతం గతంలో పనిచేసిన అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. కొంత మంది తహసీల్దార్ల సంతకాలను అచ్చుగుద్దినట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని సందర్భాల్లో నిజమైన సంతకాలు.. ఫోర్జరీలను గుర్తించడం సాధ్యం కావడం లేదని రెవెన్యూ అధికారులు అంటున్నారు.

అర్హులకు అన్యాయం

నకిలీ పట్టాలతో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోంది. అధికారికంగా పట్టాలను పొందినవారు మౌలిక వసతులు లేని కారణంగా ఇళ్లను నిర్మించుకోవడం లేదు. ఇదే అదనుగా కొందరు రాజకీయ, కుల సంఘాల నాయకులు వాటిపై కన్నేస్తున్నారు. నకిలీ పట్టాలను సృష్టించి స్థలాలను ఆక్రమిస్తున్నారు. కొందరైతే నకిలీ పట్టాలతోనే న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని సమాచారం. కోర్టులో నిజం తేలేలోగా అధికార, ధన బలంతో అనుకున్న పనికానిచ్చేస్తున్నారు. పేదలు వారితో పోరాడలేక నష్టపోతున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం..



ఇటీవల నకిలీ పట్టాల గురించి మా దృష్టికి వచ్చింది. పట్టాలు పొందిన వారు రికార్డుల్లో ఉన్నాయా లేదా అని తెలుసుకునేందుకు మా వద్దకు వస్తున్నారు. వాటిని పరిశీలిస్తే చాల వరకు నకిలీలు అని తేలుతోంది. అలా వచ్చిన పట్టాలను మేము తీసేసుకుంటున్నాం. నకిలీ పట్టాలు ఇచ్చినవారి వివరాలు ఆరా తీసి క్రిమినల్ కేసులు పెడుతున్నాం. ఉప్పరపల్లిలో ఇదే విధంగా జరిగింది.

- మోహన్‌కుమార్, తహసీల్దార్, అనంతపురం రూరల్



ఎగుమతి చేసేందుకు అరటి దిగుబడిని సిద్ధం చేస్తున్న కార్మికులు

గల్ఫ్‌కు అనంత అరటి

నేడు తాడిపత్రి నుంచి ముంబయికి బనానా రైలు
రైతుల నుంచి అరటి పంటను కొన్న ఎస్‌కే బనానా కంపెనీ
రూ.1.50 కోట్ల విలువైన 680 మెట్రిక్ టన్నుల అరటి ఎగుమతి

అనంతపురం అర్బన్/తాడిపత్రి నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశాలకు అనంత అరటి ఎగుమతి అవుతోంది. ఈ సీజన్‌లో తొలిసారిగా తాడిపత్రి రైల్వే స్టేషన్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు బనానా రైలు ముంబాయికి అరటి దిగుబడులతో బయలుదేరనుంది. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బనానా రైలును విజయవాడ నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తారు. పెద్దపప్పూరు, పుట్లూరు, యాడికి మండలాల్లో 45 మంది రైతులు పండించిన అరటి దిగుబడులను 34 కంటైనర్లల్లో తరలిస్తారు. మొత్తం రూ.1.50 కోట్ల విలువైన 680 మెట్రిక్ టన్నుల అరటిని తరలించనున్నారు. గుజరాత్‌కు చెందిన ఎస్‌కే బనానా కంపెనీ రైతుల నుంచి అరటిని కొనుగోలు చేసింది. ఆ సంస్థ గల్ఫ్ దేశాలకు అనంత అరటిని ఎగుమతి చేస్తోంది. రైతుల వద్ద కిలో రూ.20 నుంచి రూ.22 ప్రకారం కొనుగోలు చేస్తోంది. విదేశాలకు ఉద్యాన పంటలను ఎగుమతి చేసేందుకు 2016లో రాష్ట్ర ప్రభుత్వం పలు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆరేళ్లుగా దేశాయ్, ఐఎన్ఐ తదితర కంపెనీల అరటిని విదేశాలకు ఎగుమతి చేస్తోంది. 2020 జనవరిలో కిసాన్ రైలు ద్వారా జిల్లా నుంచి అరటితోపాటు పలు రకాల ఉద్యాన పంటలను ఢిల్లీకి పంపారు. ఆ తరువాత రెండేళ్లకు కిసాన్ రైలు బంద్ అయ్యింది. అప్పటి నుంచి ప్రభుత్వంతో ఒప్పందం కుర్చుకున్న పలు కంపెనీలు రైతులలో అరటి పంటను కొనుగోలు చేసి, లారీలలో తరలిస్తున్నాయి. ఈ ఏడాది తిరిగి బనానా రైలు సేవలు మొదలయ్యాయి.



తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ

జిల్లా అరటికి భలే గిరాకీ

2018-19లో మొట్టమొదటిసారి జిల్లాలో ఫ్రూట్‌కేర్ యాక్టివిటీని ఆరంభించారు. జిల్లాలో 10,496 హెక్టార్లల్లో అరటి సాగవుతోంది. ఎక్కువ శాతం పుట్లూరు, యల్లనూరు, యాడికి, నార్పల, పెద్దపప్పూరు, బుక్కరాయసముద్రం మండలాల్లో అరటి పంట ఉంది. ఏటా 8.31 లక్షల మెట్రిక్ టన్నుల అరటి దిగుబడి వస్తోంది. టిష్యూ కల్చర్‌తో తయారు చేసిన జీ-9 రకం అరటిని జిల్లాలో సాగు చేస్తున్నారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటితోపాటు ఎరువులు ఇవ్వడం ద్వారా నాణ్యమైన అరటిని రైతులు పండిస్తున్నారు. ఒప్పందం కుర్చుకున్న కంపెనీల ప్రతినిధులు అరటి సాగుపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆధునిక పద్ధతులను రైతులకు అలవాటు చేశారు. తద్వారా ఇతర జిల్లాల్లో పండించే అరటి కంటే అనంత అరటికి గిరాకీ పెరిగింది. జిల్లాలో అరటి కొనుగోలుకు 15 దాకా కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఆరేళ్ల నుంచి 10 కంపెనీల ద్వారా 1.59 లక్షల మెట్రిక్ టన్నుల అరటిని ఎగుమతి చేశారు. గల్ఫ్ దేశాలైన ఇరాన్, సౌదీ అరేబియా, ఖతార్, దుబాయ్‌కి అనంత అరటి వెళుతోంది. 2018లో 18,500 మెట్రిక్ టన్నులు, 2019లో 23వేల మెట్రిక్ టన్నులు, 2020లో 43 వేలు, 2021లో 61 వేలు, 2022లో 63 వేలు, 2023లో 63 వేల మెట్రిక్ టన్నుల అరటిని వివిధ కంపెనీల ద్వారా విదేశాలకు ఎగుమతి చేశారు.


ఏర్పాట్ల పరిశీలన

తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో బనానా రైలు ప్రారంభోత్సవ ఏర్పాట్లను జేసీ శివనారాయణశర్మ గురువారం పరిశీలించారు. విజయవాడ నుంచి శుక్రవారం మధ్యాహ్నం మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్ వర్చువల్‌గా బనానా రైలును ప్రారంభిస్తారని జేసీ తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వస్తారని తెలిపారు. అనంతరం చుక్కలూరు వద్ద ఉన్న సిద్ధార్థ కోల్డ్‌కేర్ యూనిట్‌లో బనానా ప్యాకింగ్‌ను తనిఖీ చేశారు.

లక్ష మెట్రిక్ టన్నుల లక్ష్యం..

ఈ ఏడాదిలో లక్ష మెట్రిక్ టన్నుల అరటిని విదేశాలకు ఎగుమతి చేయాలని లక్ష్యం పెట్టుకున్నాము. ఈ సీజన్‌లో తొలి సారి తిరిగి బనానా రైలు ద్వారా గల్ఫ్ దేశాలకు 680 మెట్రిక్ టన్నుల అరటిని ఎగుమతి చేస్తున్నాము. మార్చి దాకా అరటి దిగుబడి వస్తుంది. అప్పటిలోగా లక్ష్యం మేరకు లక్ష మెట్రిక్ టన్నుల అరటిని ఎగుమతి చేస్తాం. -నరసింహారావు, జిల్లా ఉద్యాన అధికారి

అసెంబ్లీ సాక్షిగా... కర్నూలుకు హైకోర్టు బెంచ్




తీర్మానం ప్రవేశ పెట్టిన న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
ఏకగ్రీవంగా ఆమోదించిన శాసనసభ
రాయలసీమ ఎమ్మెల్యేలు, మంత్రుల హర్షం

(వివరాలు 7లో)

అలరించిన సంగీత కచేరి

25 మంది విద్యార్థులకు బంగారు పతకాలు
కొనసాగుతున్న సత్యసాయి జయంత్యుత్సవాలు



నేడు పుట్టపర్తికి గవర్నర్ రాక

నేడు శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవం (7లో...)

మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి

అనంతపురం కల్చరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో లా విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐద్వా, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద గురువారం విద్యార్థినులతో కలిసి నిరసన చేపట్టారు. నిందితులను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారని, కానీ విచారణ పేరుతో పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని సావిత్రి ఆరోపించారు. గడిచిన ఐదు నెలల కాలంలో కర్నూలు, అనంతపురం, తిరుపతి, కడప జిల్లాల్లో ఇలాంటి సంఘటనలు అనేకం జరిగాయని, ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. మద్యం దుకాణాలను జనవాసాలు, కళాశాలలకు దూరంగా తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఐద్వా నగర కార్యదర్శి చంద్రిక, ఎస్ఎఫ్ఐ బాలికల విభాగం జిల్లా కన్వీనర్ రజిత, నగర నాయకులు వీరు, సాయి పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

హలో.. నేను కలెక్టర్‌ను

విద్యుత్ సమస్యలపై ఆకాశవాణిలో కలెక్టర్ ఫోన్ ఇన్ ప్రోగ్రాం

మాట్లాడుతున్నా..!

సమస్యలు తెలిపిన పలువురు వినియోగదారులు



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురంరూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. అనంతపురం రేడియో స్టేషన్‌లో గురువారం ఉదయం ఆకాశవాణి ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నా రు. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యలపై ఫోన్ ద్వారా వినియోగదారులతో మాట్లాడారు. కార్యక్రమానికి అనంతపురం, కళ్యాణదుర్గం, పెద్దవడుగూరు, శింగనమల, కూడేరు తదితర ప్రాంతాల నుంచి 19 ఫిర్యాదు లు అందాయి. వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు సకాలంలో అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, కమర్షియల్ డీఈఈ రామకృష్ణ, టెక్నికల్ ఏఈఈ భానుప్రకాష్, జేఈ మునిరాజా, డైరెక్టర్ ఆకాశవాణి అనంతపురం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఫిర్యాదులు కొన్ని ఇలా..

● శింగనమల మండలం ఉల్లికల్లు ఎస్సీ కాలనీకిచెందిన వెంకట కృష్ణమూర్తి తన ఇంటికి 2016లో మీటర్ ఏర్పాటు చేసుకున్నానని.. కరెంటు బిల్లు రూ.22వేలు వచ్చిందన్నారు. ఇంత బిల్లు ఎందుకు వచ్చిందని విద్యుత్ అధికారులను అడిగినట్లు తెలిపారు. ఒక అర్జీ ఇవ్వాలని వారు చెప్పారన్నారు. ఇంటికి ఇంత బిల్లు రాదని ఎంతో కొంతలే అని రూ.1400 చెల్లించినట్లు తెలిపారు. ఈ విషయమై ఇప్పటివరకు విద్యుత్ అధికారులు ఎలాంటి సమాధానం చెప్పలేదన్నారు.

● కలెక్టర్ స్పందిస్తూ సమస్యను నమోదు చేసుకున్నామని, ఏఈ వచ్చి సమస్య పరిష్కరించేలా చూస్తామని తెలియజేశారు.

● కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామానికి చెందిన గోవిందరెడ్డి ఫోన్‌లో మాట్లాడుతూ తాను ట్రాన్స్‌ఫార్మర్‌కు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. అధికారులు సర్వే నెంబరు తప్పుగా వేయడంతో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరులో ఆలస్యం జరుగుతోందన్నారు. దీనివలన దానిమ్మ, అరటి పంటలు ఎండిపోతున్నాయని, సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు.

● సమస్యను నమోదు చేసుకున్నామని, ఇంజనీర్లు మిమ్మల్ని సంప్రదించి పరిష్కరిస్తారని కలెక్టర్ అతడికి సమాధానం ఇచ్చారు.

● కూడేరు మండలం గొట్కూరు గ్రామానికి చెందిన గంగన్న మాట్లాడుతూ తాము మగ్గాలు నేస్తామని, ఉచిత కరెంటు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, దరఖాస్తు చేసుకొని రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికి గతంలో మాదిరిగానే బిల్లులు వస్తున్నాయన్నారు. అధికారులను సంప్రదించినా ప్రయోజనం లేకుండాపోయిందని తెలిపారు.

● కలెక్టర్ సమాధానం ఇస్తూ మగ్గాలు నేసేవారికి 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉందన్నారు. మీరు దరఖాస్తు చేసుకున్నారు కాబట్టి మీ పేరు డేటా ఎంట్రీలో ఇంకా నమోదు కాలేదేమో మరోసారి సరి చూసుకుని, మీ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు మిమ్మల్ని సంప్రదిస్తారన్నారు.


ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

తాగునీటి కోసం రాస్తారోకో

విడపనకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతానికి గత పది రోజులుగా తాగునీరు రావడం లేదని మండల కేంద్రంలోని సుంకులమ్మ గుడి ప్రాంతవాసులు జాతీయ రహదారిపై గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గౌరమ్మ పండుగ ఉన్నా తాగునీటి సమస్య పరిష్కారంలో అధికారులు చొరవ చూపడం లేదన్నారు. తాగునీరు లేక జీబీసీ వద్దకు వెళ్లి ఎద్దుల బండ్లు, ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లలో తాగు నీటిని తెచ్చుకుంటున్నామని తెలిపారు. పై నున్న కాలనీలకు రోజు తాగు నీరు వస్తోందని కింద కాలనీలకు తాగు నీరు రావటంలేదని పేర్కొన్నారు. తాగునీరు ఇచ్చేంత వరకూ రాస్తారోకో విరమించేది లేదని రోడ్డుపై భైఠాయించారు. రాస్తా రోకో వద్దకు సీఐ చిన్నగౌస్ చేరుకుని మహిళలతో చర్చించారు. సాయంత్రంలోగా తాగు నీరు అందించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు రాస్తారోకో విరమించారు. టీడీపీ నాయకులు ఈ విషయాన్ని వెంటనే మంత్రి పయ్యావుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన గ్రామంలో తాగునీటి సమస్య ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ అధ్వర్యంలో సాయంత్రానికి తాగునీరు అందించి సుంకులమ్మ ఏరియాలో తాగు నీటి సమస్యను పరిష్కరించారు.


గ్రామస్థులతో చర్చిస్తున్న సీఐ చిన్నగౌస్

మోడ్రన్ సాగు..!

ఇంటర్నెట్‌లో అన్వేషణ.. డ్రాగన్ ఫ్రూట్‌తో లాభార్జన..!

తండ్రి మెడికల్ షాపు నిర్వాహకుడు..
కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్..
వ్యవసాయం చేయాలనుకున్నారు..
చేనులో బోరు వేశారు..
ఆధునిక పంటలపై దృష్టి పెట్టారు..
కుమారుడు ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి..
ఈ ప్రాంతం డ్రాగన్ ఫ్రూట్ సాగుకు
అనుకూలమని గుర్తించాడు..
పంట సాగుకు ఉపక్రమించారు..
ఆధునిక పద్ధతులు అవలంబించారు..
మొదటి కోతలోనే లక్షల లాభాలు పండించారు..
ఇక రానున్నవన్నీ.. లాభాలే..




మల్లాపల్లి వద్ద సాగుచేసిన డ్రాగన్ ఫ్రూట్ పంట


డ్రాగన్ ఫ్రూట్ పంట దిగుబడి

గోరంట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపల్లికి చెందిన రైతు బాలకృష్ణ డ్రాగన్‌ఫ్రూట్ సాగుచేసిన ఏకైక రైతుగా, లాభాలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆధునిక పద్ధతులతో పంట సాగు చేశారు. తొలి కోతలోనే పెట్టుబడిలో 90 శాతం రాబట్టారు.

వ్యాపారం నుంచి.. వ్యవసాయంలోకి..

మల్లాపల్లికి చెందిన బాబయ్యగారి బాలక్రిష్ణ డీ ఫార్మసీ చేశాడు. 1982లో గోరంట్లలో మెడికల్ దుకాణం ఏర్పాటు చేశాడు. 2018 వరకు కొనసాగించాడు. స్వగ్రామంలో సొంత పొలం ఉండడంతో అందులో బోరు వేయించారు. నీరు సమృద్ధిగా పడడంతో మెడికల్ షాపును మూసేసి, వ్యవసాయం వైపు మళ్లాడు. వర్షపాతం తక్కువగా ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనువైన పంట సాగుచేయాలని దృష్టి సారించారు. కుమారుడు రవిశంకర్ ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి, గోరంట్ల వాతావరణానికి డ్రాగన్ ఫ్రూట్ అనువైన పంటగా గుర్తించాడు. దీంతో 1.82 ఎకరాల విస్తీర్ణంలో డ్రాగన్ పంటను రెండేళ్ల క్రితం సాగుచేశారు.

మొదటి కోతలోనే 90శాతం రాబడి

కర్ణాటకలోని పెనరగట్టలో ఒక్కో డ్రాగన్ మొక్క రూ.65 చొప్పున 3,200 కొనుగోలు చేశారు. 800 సిమెంటు స్తంభాలు నాటారు. వాటిపై ప్లేట్లు ఏర్పాటు చేశారు. స్తంభం చుట్టూ నాలుగు మొక్కల వంతున నాటారు. డ్రిప్ ద్వారా నీటి సౌకర్యం కల్పించారు. ఎకరాకు రూ.4.50 లక్షల వంతున మొత్తం పంట సాగుకు రూ.9లక్షలు ఖర్చయింది. పశువుల ఎరువు, సూక్ష్మధాతువులను డ్రిప్ విధానంలో అందించారు. ఎప్పటికప్పుడు కలుపు తొలగిస్తూ వచ్చారు. 16 నెలలకు మొదటి పంట కోతకొచ్చింది. ఏడు టన్నుల దిగుబడి దక్కింది. దీంతో రూ.7.70 లక్షల ఆదాయం వచ్చినట్లు రైతు తెలిపాడు. పెట్టుబడిలో 90శాతం తొలికోతకే వచ్చిందని రైతు ఆనందం వ్యక్తం చేశాడు.

ఏటా దిగుబడి..

పది నెలల వ్యవధిలో ఏటా ఒకసారి దిగుబడి వస్తుంది. రెండో పంటలో ప్రస్తుతం 12 టన్నుల దిగుబడి వచ్చిందని రైతు తెలిపాడు. రూ.12లక్షల ఆదాయం సమకూరింది. ఖర్చులుపోను రూ.10లక్షలు మిగిలింది. తోట వద్దే వ్యాపారులకు కిలో రూ.వందతో విక్రయిస్తున్నారు. ఏటా ఎరువులు, కలుపుతీత, కూలీల కోసం రూ.50వేలు ఖర్చు చేస్తున్నట్లు రైతు తెలిపాడు.


పంట దిగుబడిని చూపుతున్న రైతు బాలకృష్ణ

ఈ ప్రాంతానికి అనువైన పంట

జిల్లాకు డ్రాగన్ ఫ్రూట్ అనువైన పంట. ఇక్కడి వాతావరణ పరిస్థితులను బట్టి 10 నుంచి 15 రోజులకోసారి నీటి తడులు ఇవ్వాలి. చలికాలం చివరలో ఫంగస్ వచ్చే అవకాశం ఉంది. ఆ సమయంలో ఫంగస్‌ను గుర్తించి, కొమ్మలను కత్తిరించి, పడేయాలి. ఒకసారి పెట్టుబడి పెడితే 20నుంచి 25 ఏళ్లపాటు దిగుబడి వస్తుంది. కాయలు పక్వానికి వచ్చిన వెంటనే సకాలంలో కోయకపోతే పగిలి పాడైపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మరింత లాభదాయకంగా ఉంటుంది.

- బాలకృష్ణ, రైతు, మల్లాపల్లి

ఏప్రిల్‌లో వైద్య కళాశాల సిల్వర్ జూబ్లీ

ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు


సిల్వర్ జూబ్లీ నిర్వాహక కమిటీతో మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

అనంతపురం టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య కళాశాల 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 2025 ఏప్రిల్ నెలలో రజతోత్సవాలు (సిల్వర్ జూబ్లీ) నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు వెల్లడించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నిర్వాహక కమిటీతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2000 సంవత్సరం నుంచి 2019 వరకు ఇక్కడి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ తప్పనిసరిగా పూర్వవిద్యార్థుల సంఘంలో సభ్యత్వం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సభ్యుల ఆమోదం మేరకు సభ్యత్వ రుసుమును రూ.ఐదువేలు నిర్ణయించినట్లు వెల్లడించారు. మూడురోజులపాటు నిర్వహించనున్న సిల్వర్ జూబ్లీ సంబరాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, స్పోర్ట్స్‌డేకు స్టార్ షట్లర్ పీవీ సింధు, మాజీ క్రికెట్ టీం కెప్టెన్ రాహుల్ ద్రావిడ్, టెన్నిస్ క్రీడాకారుడు రాఫెల్ నడాల్‌లను ముఖ్యఅతిథులుగా ఆహ్వానిస్తామన్నారు. అనంతపురంలో విశేష సేవలందించిన సీనియర్ వైద్యులందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఈ సంబరాల్లో చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంబరాలను పురస్కరించుకుని ఫిబ్రవరి, మార్చి నెలల్లో మెడికల్ ఎగ్జిబిషన్స్ నిర్వహించడానికి కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు డాక్టర్ ఆత్మారామ్, డాక్టర్ మధుసూదన్, చైతన్య, నీలిమ చౌదరి, రమణనాయక్, శ్రీహర్ష, సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ దుర్గ, భీమసేనాచారి, శ్రీనివాసులు, శైలజ, స్వాతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సెక్టోరియల్ జాబితాలో అక్రమాలు


సమావేశంలో పాల్గొన్న ఎల్లన్న, నాగభూషణం తదితరులు

అనంతపురం సెంట్రల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ల ఎంపిక జాబితాను అక్రమంగా రూపొందించారని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ మెంబర్ ఎల్లన్న, ఆర్ఈఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎండీ నాగభూషణం మండిపడ్డారు. ఆ సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేసిన వరలక్ష్మి సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ల నియామకంలో వసూళ్లకు పాల్పడి అనర్హులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. రిజర్వేషన్ వర్గాల ఉపాధ్యాయులకు దక్కాల్సిన పోస్టులను అమ్ముకుని జాబితాను తయారుచేశారన్నారు. గత డీఈఓ వరలక్ష్మి ఎంపిక చేసిన జాబితాను రద్దుచేసి అర్హులైన రిజర్వేషన్ వర్గాల ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం
లెక్కింపు

రామగిరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధి చెందిన ముత్యాలమ్మ ఆలయం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ ఈఓ వెంకటేశులు, దేవదాయ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి, స్థానిక పెద్దలు రామ్మూర్తినాయుడు సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నాలుగు నెలల 17 రోజులకుగాను రూ.13,15,634 ఆదాయం వచ్చినట్టు వారు తెలిపారు.


హుండీని లెక్కిస్తున్న దృశ్యం

నియోజకవర్గాల సమస్యలు
పరిష్కరించండి

సీఎం, మంత్రులకు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి


మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

అనంతపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ముఖ్యమంత్రి, పలువురు మంత్రులను కోరారు. అసెంబ్లీ ఆవరణంలో గురువారం వారు సీఎం చంద్రబాబునాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, భూగర్భగనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రలను కలిసి వినతి పత్రం అందజేశారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని నడిమివంక రక్షణ గోడ నిర్మాణంతో పాటు నియోజకవర్గంలో ప్రాజెక్టుల పనులను చేపట్టాలని కోరారు. పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనులు, గేట్ల మరమ్మతులు చేయించాలన్నారు. పీఏబీఆర్ కుడికాలువ ద్వారా 53 చెరువులకు నీరందించాలన్నారు. హెచ్చెల్సీ ద్వారా పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల చేయాలని కోరారు. ఈ కాలవ నుంచి తాడిమర్రి మండలంలోని చివరి చెరువు వరకూ నీరు అందేలా చూడాలన్నారు. ముదిగుబ్బ మండలంలో జిల్లేడుబండ ప్రాజెక్టు పనులు నిలిపివేశారని, ఈ ప్రాజెక్టు పరిధిలో రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇచ్చి ప్రాజెక్టును నిర్మించాలని ఇరిగేషన్ మంత్రిని కోరారు. ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, పరికరాలు మంజూరు చేయాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరగా.. ఆయన వెంటనే సీఎండీకి ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి పలు గ్రామాలు, ఎస్సీఎస్టీ కాలనీల్లో దేవాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలోని తిరుమల దేవరస్వామి ఆలయం సముదాయంలోని దుర్గాదేవి ఆలయానికి మెట్ల ఏర్పాటు, రూ.50లక్షలతో స్నాక్‌బార్ మరుగుదొడ్లను నిర్మించాలన్నారు. పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ని కలిసి రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో పర్యాటక రంగ అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుమల దేవర వెంకటేశ్వరస్వామి ఆలయంలో పర్యాటక సౌకర్యాల అభివృద్ధి, ఎన్‌హెచ్ 44 అనంతపురం సమీపంలోని మరూరు టోల్‌గేట్ వద్ద రూ. 25 లక్షలతో స్నాక్ బార్ నిర్మాణం, ఆత్మకూరు జాతీయ రహదారి సమీపంలో టూరిజం వేసైడ్ సౌకర్యాలు, నసనకోట ముత్యాలమ్మ గుడి దగ్గర, చెన్నేకొత్తపల్లి మండలం సమీపంలోని కోన శివాలయం వద్ద పిల్లలు ఆడుకోవడానికి ప్లే ఏరియా, టూరిజం రెస్టారెంట్, మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. పేరూరు డ్యాం వద్ద బోటింగ్ అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేయగా... ఆయన సానుకూలంగా స్పందించారు. మరోవైపు భూగర్భగనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రని కలిసి రామగిరి బంగారు గనులను మళ్లీ తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు సమస్యలన్నింటిపై సానుకూలంగా స్పందిస్తూ... సంబంధిత శాఖల అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకొని పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌లు తెలిపారు.

లస్సీ షాపులో
రూ.లక్ష చోరీ

అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ లస్సీ షాపులో రూ.లక్ష చోరీ అయ్యింది. నగరంలోని లాల్‌బాగ్ స్ట్రీట్‌లో చిన్న కుళ్లాయిస్వామి కుటుంబంతో నివాసముంటున్నాడు. కమలానగర్‌లో వినాయ క లస్సీ పాయింట్ పేరుతో ఓ దుకాణం నిర్వహిస్తున్నారు. ఈనెల 19న రాత్రి 10గంటలకు షాపు మూసి వెళ్లారు. 20 ఉదయం దుకాణం తెరిచే ప్రయత్నంలోనే తాళాలు బద్దలు కొట్టినట్లు గుర్తించారు. క్యాష్ కౌంటర్‌లో ఉండాల్సిన రూ.లక్ష, ఒక మొబైల్‌ను ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పదో తరగతి విద్యార్థిని అదృశ్యం

అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని నేతాజీనగర్‌కు చెందిన పదోతరగతి విద్యార్థిని సుగుణ ఇంటి నుంచి అదృశ్యమైంది. బుధవారం ఉదయం స్కూల్‌కు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆ పాఠశాలలో ఆరా తీశారు. స్కూల్‌కు రాలేదని చెప్పడంతో తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎంపీడీఓ అమృత్‌రాజ్ డిస్మిస్ ఉత్తర్వుల కొట్టివేత

అనంతపురం విద్య, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ ఎంపీడీఓ అమృత్‌రాజ్ డిస్మిస్ ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. దీంతో తనకు పోస్టింగ్ ఇవ్వాలంటూ గురువారం జడ్పీలోని అధికారులకు ఆయన వినతిపత్రం ఇచ్చారు. గతంలో నిధుల దుర్వినియోగం, ఇతర ఆరోపణలపై గత ప్రభుత్వంలో కొందరు వైసీపీ నాయకులు, కొందరు ఉన్నతాధికారుల ఒత్తిళ్లవల్ల ఆయనను పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు డిస్మిస్ చేశారు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఆయనకు అనుకూలంగా తీర్పురావడంతో పోస్టింగ్ కోసం జడ్పీలో అధికారులను కలిశారు.

గ్రామీణ బాలికల క్రికెట్‌లో సెంచరీల మోత



తేజశ్రీ శర్మ, నందేశ్వరి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ బాలికల క్రికెట్ పోటీల్లో జిల్లా బ్యాటర్లు సెంచరీల మోత మోగించారు. గురువారం జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్తాధ్వర్యంలో రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించారు. నార్పల అండర్-16, పెనుకొండ అండర్-16 బాలికల జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన నార్పల జట్టు 30 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 379 పరుగులు చేసింది. బ్యాటర్ తేశ్రీ వర్మ 102 బంతుల్లో 35బౌండరీల సాయంతో 173 పరుగులు, నందేశ్వరి 111 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన పెనుకొండ 30ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 126పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. సెంచరీలు సాధించిన బ్యాటర్లకు జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

లక్ష్యాలను వందశాతం సాధించాలి: కలెక్టరు

అనంతపురంటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆయాశాఖలకు కేటాయించిన ప్రభుత్వ పథకాల లక్ష్యాలను వందశాతం సాధించాలని అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆయన గురువారం అధికారులతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. హౌస్‌టుహౌస్ జియోకోఆర్డినేట్స్ అప్డేట్ పెండింగ్ అనంతనగరంలో అధికంగా ఉందని దీనిని వేగవంతం చేయాలని నగరపాలక అధికారులను ఆదేశించారు. నగరపాలక పరిధిలో సచివాలయ సిబ్బంది కొరతతో పాటు మూడేళ్ల కిందట మ్యాపింగ్ జరిగిందని, ఎక్కువ వయసు ఉన్న వయోవృద్ధులు ఎక్కువ మందికి ఐరిష్, బయోమెట్రిక్ పనిచేయడంలేదని కమిషనర్ వివరించారు. ఇంకొందరు నెలమొదటిలో వచ్చి పింఛన్ తీసుకొని, ఆతర్వాత కనిపించకుండా పోతున్నారని, అందుకే ఎక్కువ మ్యాపింగ్ చేయలేకపోతున్నామని తెలిపారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా పింఛన్లు ఇచ్చేరోజే డోర్‌టు డోర్ ఈకార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టరు ఆదేశించారు. మరణించిన వారిపేర్లు జాబితాలో ఉన్నాయని దీనిపై స్పష్టత తీసుకుందామని తెలిపారు. బ్రహ్మసముద్రం, కుందుర్పి, శెట్టూరు, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్‌లలో ప్రణాళిక వేసుకొని ప్రగతి సాధించాలని ఆదేశించారు.

• షోకాజ్ నోటీసు ఇవ్వండి

కలెక్టరు నిర్వహించిన కాన్ఫరెన్స్‌కు బెళుగుప్ప ఎంపీడీఓ గైర్హాజయ్యారు. దీనిపై జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఎంపీడీఓకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. అధికారులు క్రమశిక్షణతో మెలగాలని ఈసందర్భంగా కలెక్టరు సూచించారు.

ఆర్ఆర్‌బీ పరీక్షకు ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఉద్యోగ నియామకం కోసం నిర్వహించనున్న పరీక్ష కోసం జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నాందేడ్-తిరుపతి మధ్య ప్రత్యేక రైలు (నం. 07105) ఈనెల 23న నాందేడ్‌లో మధ్యాహ్నం 12.25 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6-25 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని తెలియజేశారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07106) తిరుపతిలో ఈనెల 24మధ్యాహ్నం 3-35 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8-25 గంటలకు నాందేడ్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు ముడ్‌ఖేడ్, ధర్మాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కాచిగూడ, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లి, పీలేరు, పాకాల స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. అలాగే హుబ్లీ-కర్నూలు ప్రత్యేక రైలు (నం. 07315) ఈ నెల 24, 25, 26, 27 తేదీల్లో హుబ్లీలో రాత్రి 8-15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం ఆరు గంటలకు కర్నూలుకు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07316) కర్నూలులో ఈనెల 25, 26, 27, 28 తేదీల్లో ఉదయం ఏడున్నరకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4-15 గంటలకు హుబ్లీకి చేరుకుంటుందన్నారు. ఈ రైలు గదగ్, కొప్పల్, హోస్పేట, తోరణగల్లు, బళ్లారి, గుంతకల్లు, డోన్ స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందన్నారు. ఆర్ఆర్‌బీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు వినియోగించుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

వ్యవసాయ తోటల్లో కేబుల్‌వైరు చోరీ


ఆదినారాయణరెడ్డి తోటలో కేబుల్ వైరు ఎత్తుకెళ్లిన దుండగులు

యాడికి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలమడుగు గ్రామంలో బుధవారం రాత్రి కేబుల్ వైరు దొంగలు పేట్రేగిపోయారు. 8మంది రైతుల వ్యవసాయ బోరుబావుల కేబుల్‌వైరు చోరీ చేశారు. గ్రామానికి చెందిన సుధాకర్‌నాయుడు, జయనాయుడు, రాజామనోహర్‌నాయుడు, చంద్రశేఖర్, ఆదినారాయణరెడ్డి, నరసింహారెడ్డి, తిరుమలరెడ్డి, గోపాల్‌రెడ్డి అనే రైతుల తోటల్లో సుమారు 200మీటర్ల కేబుల్‌వైరును దుండగులు కత్తిరించి ఎత్తుకెళ్లారు. దుండగుల ఆగడాలతో పంటలను ఎండబెట్టుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన కొందరు దుండగులు కేబుల్‌వైర్ల చోరీలకు పాల్పడుతున్నట్లు రైతులు తెలిపారు. దీనిపై పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


సుధాకర్‌నాయుడు తోటలో...



రాజా మనోహర్ నాయుడు తోటలో, నరసింహా రెడ్డి తోటలో..

కర్నూలుకు హైకోర్టు బెంచ్

- తీర్మానం ప్రవేశ పెట్టిన న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- ఏకగ్రీవంగా ఆమోదించిన శాసనసభ
- రాయలసీమ ఎమ్మెల్యేలు, మంత్రుల హర్షం
- ఇప్పటికే హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు ప్రభుత్వం లేఖ
- ప్రజాగళం సభలో చంద్రబాబు హామీ
- ఐదు నెలల్లోనే అమలుకు శ్రీకారం
- ఐదేళ్లపాటు నాన్చిన జగన్ ప్రభుత్వం



కర్నూలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియలో మరో ముందడుగు పడింది. ఇప్పటికే అభిప్రాయం కోరుతూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి వి.సునీత గత నెల 28న లేఖ రాశారు. ఈక్రమంలోనే బుధవారం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం తీర్మానం ప్రవేశ పెట్టగా శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రాయలసీమ ఎమ్మెల్యేలు, మంత్రులు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం కర్నూలును న్యాయ రాజధానిగా చేసి, హైకోర్టు ఏర్పాటు చేస్తామని సీమ ప్రజలను ఐదేళ్లు మభ్యపెట్టారు. అయితే ఎన్నికల ముందు ప్రజాగళం సభలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రతిపక్ష నేతగా చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన ఐదు నెలలకే అమలు దిశగా అడుగులు వేస్తున్నారు. అసెంబ్లీ తీర్మానంపై రాయలసీమ వ్యాప్తంగా న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లు మభ్యపెట్టిన వైసీపీ

కర్నూలులో హైకోర్టు అంటూ వైసీపీ రాజకీయ స్వలాభం కోసం ఐదేళ్లు మభ్యపెట్టారు. మరోవైపు రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమి మంగళగిరిలో ఏర్పాటుకు సంబంధించి జీవో ఇచ్చారు. 2022 డిసెంబరు 5న కర్నూలు నగరంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో వైసీపీ నిర్వహించిన సీమ గర్జన సభలో జిల్లాకు చెందిన అప్పటి మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కర్నూలును న్యాయ రాజధానిగా మారుస్తాం.. హైకోర్టు ఏర్పాటు చేస్తాం అంటూ పదేపదే ఉపన్యాసాలు ఇచ్చారు. బుగ్గన ఓ అడుగు ముందుకేసి కర్నూలు నగరానికి నాలుగు వైపులా 25 కిలోమీటర్ల దూరంలో కనిపించేలా జగన్నాథగట్టుపై అందమైన హైకోర్టు భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. మాయ చేశారే తప్పా అమలుకు చర్యలు చేపట్టలేదు.

ఐదు నెలల్లోనే...

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని 2019 ఎన్నికల్లో అప్పటి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి.. వైసీపీ అధికారం చేపట్టింది. అయినా చంద్రబాబు మాట మార్చలేదు. అదే హామీకి కట్టుబడి నిలబడ్డారు. గత ఎన్నికల్లో అధికార వైసీపీ నేతలు, సీఎం జగన్ కర్నూలు న్యాయ రాజధాని, హైకోర్టు ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తే.. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు 'హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం.. అధికారంలోకి రాగానే ఆ ప్రక్రియ మొదలు పెడుతాం..' అంటూ ప్రజాగళం సభలో స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు వేసింది. హైకోర్టు అభిప్రాయం కోరుతూ గత నెల 28న లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్, లా డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ కార్యదర్శి వి.సునీత గత నెల 28న లేఖ నంబరు.2589691/ఎస్‌సీ.ఎఫ్/ఏ2/2024 కింద హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాశారు. ఆ వెంటనే బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గం సమావేశంలో ఆమోదం, గురువారం శాసనసభ, మండలిలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ చర్యలో పాల్గొన్న రాయలసీమ జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేల హర్షం వ్యక్తం చేశారు.

సాకారం దిశగా 87 ఏళ్ల స్వప్నం

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు 87 ఏళ్ల స్వప్నం. బెంచ్ రూపంలో సాకారం కాబోతుందని రాయలసీమ న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. 1937 నవంబరు 16న మద్రాస్‌లో కాశీనాథుని నాగేశ్వరరావు స్వగృహంలో శ్రీబాగ్ భవనంలో జరిగిన కోస్తాంధ్ర, రాయలసీమ ప్రతినిధుల సమావేశంలో రాయలసీమలో రాజధాని లేదా హైకోర్టు ఏర్పాటు చేయాలని ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందమే 'శ్రీబాగ్ ఒడంబడిక'. 1952 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుతో కర్నూలు కేంద్రంగా రాజధాని ఏర్పాటు చేసినా నాలుగేళ్ల ముచ్చటగానే ముగిసింది. 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుతో రాజధాని హైదరాబాద్‌కు తరలిపోయింది. అయితే.. సీమ ప్రజల మదిలో శ్రీబాగ్ ఒడంబడిక అంశాలు చెదిరిపోలేదు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశారు.



వైసీపీ మాట తప్పింది.. మడమ తిప్పింది..

సవిత, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, శ్రీసత్యసాయి జిల్లా



వైసీపీ ప్రభుత్వ హయాంలో హైకోర్టు ఏర్పాటు చేస్తామని పాలాభిషేకాలు చేయించుకున్నారు. మాట తప్పం.. మడమ తిప్పం అన్నారు. మాట తప్పి మడత తిప్పి రాయలసీమ ద్రోహిగా జగన్ నిలిచారు. చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం అభినందనీయం.

మాట నిలబెట్టుకున్న బాబు..

పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే



అనంతపురం అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రివర్గంలో తీర్మానం చేయడం, మండలిలో బిల్లు ప్రవేశపెట్టడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. గత ఎన్నికలకు ముందు ప్రజాగళం సభలో చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారని, ఆ మేరకు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కసరత్తులు మొదలు పెట్టిందన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం తక్షణ చర్యలు మొదలు పెట్టాలని కోరుతూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాసినందుకు ఆమె ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

బెంచ్ ఏర్పాటు హర్షణీయం

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



అనంతపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు నిర్ణయం హర్షణీయమని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా గురువారం నిర్వహించిన ప్రశ్నోత్తరాల సమయంలో కాలవ శ్రీనివాసులు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీమ బిడ్డగా రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నందుకు తనకు గర్వంగా ఉందన్నారు. దశాబ్దాల కాలంగా రాయలసీమ ప్రజలు, ముఖ్యంగా సీనియర్ న్యాయవాదులు కోరుకుంటున్న హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండటం శుభపరిణామమన్నారు. 2014-19 మధ్య కాలంలో చంద్రబాబునాయుడు రాయలసీమలో హైకోర్టు బెంచ్‌కు స్పష్టమైన హామీ ఇవ్వడంతో పాటు తొలి అడుగు వేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో న్యాయ రాజధాని కర్నూలులో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేస్తామని చెప్పి రాయలసీమ ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. అప్పటి 22 మంది వైసీపీ ఎంపీలు హైకోర్టు ఏర్పాటుపై ఐదేళ్లలో ఒక్కసారి కూడా కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన దాఖలాలు లేవన్నారు.

జగన్‌ది మోసం

ఒకవైపు జగన్మోహన్‌రెడ్డి న్యాయ రాజధానిని కర్నూలులో ఏర్పాటు చేస్తానని ప్రకటనలు ఇస్తుండగానే అదే ప్రభుత్వం ఏపీ జుడీషియల్ అకాడమీని మంగళగిరిలో స్థాపిస్తున్నట్లు జీవో ఇవ్వడం మోసమేనన్నారు. జుడీషియల్ అకాడమీ మంగళగిరిలో ఏర్పాటైన విషయంపై రాయలసీమ ప్రజలందరూ అప్పట్లో తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. కర్నూలులో హై కోర్టు బెంచ్ పెట్టే ఆలోచన గతంలో ఉండేదని, ప్రస్తుతం ఆ ఆలోచన విరమించుకుంటున్నట్లు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2022 నవంబరు 28న సుప్రీంకోర్టుకు తెలిపిందని కాలవ గుర్తు చేశారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుచేసే ఆలోచన ఏ మాత్రం లేదని స్వయంగా జగన్మోహన్‌రెడ్డి సుప్రీంకోర్టుకు విన్నవించడం ద్వారా రాయలసీమ ద్రోహిగా మిగిలిపోయాడన్నారు. చంద్రబాబునాయుడు ప్రజాగళంలో ఇచ్చిన మాటకు కట్టుబడి కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు.

న్యూస్‌బాక్స్

పది విద్యార్థులు మాధ్యమం ఎంచుకోవచ్చు

కొత్తచెరువు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు 2025లో నిర్వహించే పబ్లిక్ పరీక్షలకు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చని విద్యాశాఖ ఏడీ-3 లాజర్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు తెలుగు, ఇంగ్లీషు మీడియం ఎంచుకునే అవకాశం ఉందన్నారు. 8, 9 తరగతులను ఆంగ్లమాధ్యమంలో చదివి ఉండుంటే అదే మీడియంకు ప్రాధాన్యత ఇచ్చుకోవచ్చన్నారు. తెలుగు మీడియం చదివిన వారు ఇంగ్లిష్, తెలుగు ఏదైనా ఎంచుకోవచ్చన్నారు. పాఠశాల హెచ్ఎం, జిల్లా విద్యాశాఖాధికారి, ప్రభుత్వ పరీక్షల సహాయ సంచాలకుడికి మాత్రమే మాధ్యమాన్ని మార్చే వీలుంటుందన్నారు. తెలుగు మాధ్యమంలో చదివిన వారు ఇంగ్లిష్ మీడియం ఎంచుకుని ఉండుంటే 25వ తేదీలోగా మార్చుకోవచ్చని ఆయన ప్రకటనలో వివరించారు.

టమోటా కిలో రూ.28

అనంతపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 28తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 23, కనిష్ఠ ధర రూ. 16 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.39 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.39,200 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 12వేలు, సరాసరి రూ. 23,800తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 62 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

1.648 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటి నిల్వ 1.648 టీఎంసీలు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు గురువారం తెలిపారు. అలాగే రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 1132 క్యూసెక్కులుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 722 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

24న బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ సీనియర్ పురుషులు, మహిళల జట్ల ఎంపిక పోటీలు ఈనెల 24న ఉదయం 8గంటలకు ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు 6 నుంచి 9 వరకు పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులో నిర్వహించే 10వ ఏపీ సీనియర్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు క్రీడా సామగ్రి, యూనిఫాం, ఆధార్‌కార్డులతో హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్ నంబరు 9393711324ను సంప్రదించాలని కోరారు.

టేబుల్ టెన్నిస్ క్రీడాకారులకు...

జిల్లా స్థాయి టేబుల్‌టెన్నిస్ బాల, బాలిక క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 24న అనంతపూర్ క్లబ్‌లోని ఇండోర్‌స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా టేబుల్‌టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేశవరెడ్డి, శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-15, సీనియర్ బాల, బాలికల కేటగిరీల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రి, యూ నిఫాంతో హాజరుకావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు మొదటి వారంలో కాకినాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 9440289940ను సంప్రదించాలని కోరారు.

24న వాల్మీకుల కార్తీక వనభోజన మహోత్సవం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా వాల్మీకి గెజిటెడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న నగర శివారులో ఉన్న నాగిరెడ్డి పల్లి గార్డెన్స్‌లో కార్తీక మాస వనభోజన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రతినిధి ఈశ్వర్ తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న వాల్మీకి గెజిటెడ్ ఆఫీసర్లు హాజరుకానున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 8179192331ను సంప్రదించాలని కోరారు.

నేడు పూల నాగరాజు ప్రమాణ స్వీకారం

అనంతపురం కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ చైర్మన్‌గా నియమితుడైన పూల నాగరాజు శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు అనంతపురం బస్టాండుపై ఉన్న ఆయన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టనున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నామినేటెడ్ పదవుల్లో భాగంగా కడప జోనల్ చైర్మన్‌గా పూల నాగరాజును నియమించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. కార్యక్రమానికి ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఈడీ చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరవనున్నట్లు సమాచారం.

అలరించిన సంగీత కచేరి

- 25 మంది విద్యార్థులకు బంగారు పతకాలు
- కొనసాగుతున్న సత్యసాయి జయంత్యుత్సవాలు



పాటలు పాడుతున్న భక్తులు



పతకం ప్రదానం చేస్తున్న ట్రస్టు సభ్యుడు చక్రవర్తి

పుట్టపర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంత్యుత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ మందిరంలో సేవాసంస్థల యువత సంగీత కచేరి భక్తులను అలరింపజేసింది. సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాల నాలుగోరోజు సేవాసంస్థల సదస్సు కొనసాగించారు. ఈ సందర్భంగా సత్యసాయి ప్రేమతత్వంపై భక్తిగీతాలను ఆలపించారు. అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు, ప్రేమే దైవం పేరిట భక్తిపాటలతో అలరింపజేశారు.

25 మందికి బంగారు పతకాలు

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచిన 25 మంది విద్యార్థులకు శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి బంగారు పతకాలను ప్రదానం చేశారు. 2017 నుంచి దక్షిణ భారత దేశంలోని పలురాష్ట్రాల్లో పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆయా రాష్ట్రాల్లో సేవాసంస్థలు పోటీలను నిర్వహించాయి. తెలుగు రాష్ట్రాల్లోని 5517 కాలేజీలు, పాఠశాలల్లో పోటీలు పెట్టారు. 2.72 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 20 మంది విద్యార్థినులు, ఐదుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరికి సాయికుల్వంత్ వేదికగా చక్రవర్తి బంగారు పతకాలను ప్రదానం చేశారు.

భక్తి పారవశ్యం

సాయికుల్వంత్ మందిరంలో సాయంత్రం సగీత కచేరి నిర్వహించారు. భక్తిగీతాలతో అలరింపజేశారు. ఈ సందర్భంగా సాయికుల్వంత్ సభామందిరాన్ని ప్రత్యేక విద్యుద్దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యులు డాక్టర్ మోహన్, సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే పాల్గొన్నారు.

విలువల విద్యాలయం

- నేడు శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవం



పుట్టపర్తి, నవంబరు21(ఆంధ్రజ్యోతి): విలువలు కలిగిన ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా సత్యసాయి విద్యావిధానం కొనసాగుతోంది. బాబా స్థాపించిన చిన్న విద్యాసంస్థ డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి చేరింది. క్రమశిక్షణ, ఆధ్యాత్మికత, విలువలతో కూడిన విద్యను ఉచితంగా అందిస్తున్నారు. అలాంటి విలువల విశ్వవిద్యాలయ 43వ స్నాతకోత్సవం శుక్రవారం ప్రశాంతినిలయంలోని సాయి కుల్వంత్ సభామండపంలో ఘనంగా నిర్వహించనున్నారు. యూఎస్ జాతీయ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతురామన్ పంచనాథన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభ కనబరచిన 22 మందికి బంగారు పతకాలను ప్రదానం చేస్తారు. 14 మందికి పీహెచ్‌డీలు అందజేస్తారు. ఇందుకోసం సాయికుల్వంత్ మందిరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

చిన్న సంస్థతో మొదలు..

సత్యసాయిబాబా ఆధ్యాత్మిక బోధనలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆదేస్థాయిలో ఆధ్యాత్మికత, విలువలతో కూడిన విద్యను అందించడానికి 8 దశాబ్దాల క్రితమే శ్రీకారం చుట్టారు. 1962లో ప్రారంభించిన చిన్నపాటి విద్యాసంస్థ ప్రస్తుతం యూనివర్సిటీ స్థాయికి చేరింది. 1981 నవంబరు 22న స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన శ్రీసత్యసాయి యూనివర్సిటీని సత్యసాయిబాబా స్థాపించారు. ఆ తరువాత ప్రాథమిక విద్య నుంచి పీహెచ్‌డీ స్థాయివరకు శాస్త్రసాంకేతికత, విలువలతో కూడిన విద్య అందిస్తూ వచ్చారు. వేలమంది విద్యార్థులను తీర్చిదిద్దారు.

రెండు రాష్ట్రాల్లో విద్య

సత్యసాయి విలువలతో కూడిన విద్యను తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలో సైతం విస్తరించారు. ఏపీలో ప్రశాంతినిలయం, అనంతపురం మహిళా క్యాంపస్, కర్ణాటకలోని బెంగళూరు బృందావనం క్యాంపస్, చిక్‌బళాపురం వద్ద ఉన్న ముద్దనహళ్లి క్యాంపస్ ద్వారా విద్య అందిస్తున్నారు. ప్రశాంతి నిలయంలోని యూనివర్సిటీ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు నడుస్తున్నాయి. భారత్‌లోనే కాక విదేశాల్లో సైతం సత్యసాయివిలువల విద్యకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

అందరికీ ఉచితం

నేడు ఉన్నత చదువులు చదవాలంటే రూ.లక్షలు ఖర్చు పెట్టుకోవాల్సిందే. దశాబ్దాల క్రితమే సత్యసాయిబాబా విలువలు, ఆధ్యాత్మికతతో కూడిన విద్యను అందరికీ ఉచితంగా అందించేందుకు శ్రీకారం చుట్టారు. నేటికీ నిరంతరాయంగా ఉచిత విద్య కొనసాగుతోంది. క్రమశిక్షణ, ప్రేమ వాతావరణంలో ఆధ్యాత్మికతతో కూడిన విద్యను అందిస్తున్నారు. విద్యార్థుల్లో స్వావలంబన, సామాజిక సేవస్ఫూర్తిని పెంపొందిస్తున్నారు. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఉన్నతస్థానంలో నిలిపేందుకు సత్యసాయి విద్యావిధానం అన్నివిధాలా తోడ్పడుతుందన్నది అక్షరసత్యం. మహిళా విద్యను ప్రోత్సహించడానికి అనంతపురంలో ప్రత్యేక క్యాంపస్ ఏర్పాటు చేశారు. పీజీ, పీహెచ్‌డీ వరకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారు.

నేడు పుట్టపర్తికి గవర్నర్ రాక

- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తిటౌన్/రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం రాత్రి రానున్నారు. గవర్నర్ విజయవాడ నుంచి బయలుదేరి రాత్రికి పుట్టపర్తి చేరుకుంటారని కలెక్టర్ చేతన్ తెలిపారు. 23న సత్యసాయిబాబా జయంత్యుత్సవాల్లో పాల్గొంటారన్నారు. గవర్నర్ పర్యటన ఖరారవడంతో పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని యంత్రాంగాన్ని కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న ఆదేశించారు. వారు గురువారం గవర్నర్ పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. గవర్నర్ బసచేసే సాయి శ్రీ నివాస్ అతిథిగృహం, సాయికుల్వంత్ సభామండపం, పూర్ణచంద్ర ఆడిటోరియం ప్రాంతాలను పరిశీలించారు. సూచిక బోర్డులు ప్రదర్శించాలని ఆర్డీఓ సువర్ణను ఆదేశించారు. కలెక్టర్, ఎస్పీతోపాటు డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, తహసీల్దార్ అనుపమ, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇక 30 అడుగుల రోడ్డు చాలు

- అహుడా నిబంధనల్లో మార్పు..?
- త్వరలో ఉత్తర్వులు



అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అనంతపురం-హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో కొత్త నిబంధనలు అమలులోకి వస్తాయని తెలిసింది. అహుడా పరిధిలో వేసే వెంచర్‌లలో 40 అడుగుల రోడ్డు ఉండాలనే నిబంధన ఉంది. దీన్ని 30 అడుగులకు కుదించే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో పాటు అనుమతులకు సంబంధించి కొన్ని నిబంధనలు మారుతాయని తెలిసింది. వీటికి సంబంధించి ప్రభుత్వం నుంచి త్వరలో ఉత్తర్వులు వస్తాయని అహుడా అధికారవర్గాలు తెలిపాయి. అహుడాలో పరిధిలో ఎన్నో వెంచర్లను అనధికారికంగా వేశారు. వైసీపీ ప్రభుత్వం లే అవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) విషయంలో అలసత్వం ప్రదర్శించింది. క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎంతో మంది ఎదురుచూస్తున్నారు.

స్తంభించిన వెబ్‌సైట్

కొన్ని రోజులుగా అహుడా వెబ్‌సైట్ స్తంభించింది. ఆన్‌లైన్‌లో జరిగే అప్రూవల్స్ లే అవుట్ల ఫైల్స్ పరిశీలన ప్రక్రియకు బ్రేక్ పడింది. నెలరోజులుగా ఈ పరిస్థితి కొనసాగుతోంది. మధ్యలో కొన్ని రోజులు వెబ్‌సైట్ పనిచేసినా, కొన్ని గంటలకే పరిమితమైంది. దీంతో అహుడా కార్యాలయానికి వచ్చే వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

సంక్షిప్తం

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

ఆత్మకూరు నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇంటింటా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ అధికారులును ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని గ్రామ పంచాయతీ సిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటా టాయిలెట్లు నిర్మించుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● రాప్తాడు: వ్యక్తిగత మరుగుదొడు, కమ్యూనిటీ మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. గురువారం రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి, వారు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డి ఆనంద్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామసభలు

రాప్తాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ జాబ్ కార్డుల పునః పరిశీలనపై శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఓ సావిత్రి తెలిపారు. గ్రామ సభలో చనిపోయిన వ్యక్తులను, వలస వెళ్లిన వారిని జాబ్‌కార్డుల నుంచి తొలగిస్తామన్నారు. అలాగే 18 సంవత్సరాలు పూర్తయిన వారికి జాబ్‌కార్డుల్లో జమ చేస్తామన్నారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీపీఎం నుంచి బహిష్కరణ

అనంతపురం కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రెండో నగర కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తున్న లక్ష్మీనారాయణను పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఆ కమిటీ కార్యదర్శి ఆర్‌వీ నాయుడు గురువారం ప్రకటనలో వెల్లడించారు. ఇటీవలి కాలంలో అభ్యుదయ కాలనీలో నివాసముంటున్న విజయ్ అనే దళితుడు ఇంటిపైనా దాడికి పాల్పడడంతో లక్ష్మీనారాయణపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందన్నారు. పార్టీని అడ్డం పెట్టుకుని ఆయన చేస్తున్న అరాచకాలను ప్రజలు పార్టీ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. వీటిపై విచారణ జరిపిన పార్టీ నాయకత్వం ఆయనను పార్టీ నుంచి బహిష్కరించిందన్నారు.

సరుకుల వితరణ

అనంతపురం కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన ఆదరణ సేవా హోమ్‌కు షిర్డీసాయి అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో నిత్యావసర సరు కులు వితరణ చేశారు. ఆదరణ సేవా హో మ్ నిర్వాహకుడు తాడిమర్రి లాల్‌బాషాను గురువారం షిర్డీసాయి అన్నదాన సేవాసంఘం నిర్వాహకులు చెక్కా సుబ్రహ్మణ్యం, సదాశివగుప్త, జగన్నాథగుప్త కలిశారు. సేవాహోమ్‌లోని వృద్ధులు, పేద విద్యార్థుల కోసం రూ.14వేలు విలువచేసే నిత్యావసర సరుకులను అందజేశారు.

గుంతను పూడ్చిన పోలీసులు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నాగసముద్రం గ్రామ సమీపంలో ఏర్పడిన అఘాధమైన గుంతను గురువారం పోలీసులు పూడ్చివేశారు. ధర్మవరం నుంచి ఎన్ఎస్‌గేటుకు వెళ్లే ప్రదాన రహదరిపైపెద్ద గుంత ఏర్పడి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, రామగిరి సీఐ శ్రీదర్ సూచన మేరకు ఎస్ఐ సత్యనారాయణ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ క్రమంలో సీకేపల్లి హెడ్ కానిస్టేబుల్ రఘునాథ్, కానిస్టేబుల్ అమర్‌నాథ్ శ్రమదానం చేసి గుంతను పూడ్చారు.

పోక్సో కేసులో వ్యక్తికి రిమాండ్

అనంతపురం క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఆత్మకూరు మండలం మదిగుబ్బకు చెందిన రవీంద్ర అనే వ్యక్తిని టూటౌన్ పోలీసులు గురువారం రిమాండ్‌కు పంపారు. రవీంద్ర నగంలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. సాయినగర్‌లో ఓ హాస్టల్‌లో ఉంటున్న ఇంటర్ విద్యార్థినిపై దాడి ఘటనలో టూటౌన్ పోలీసులు ఇతడిని అరెస్ట్ చేశారు.

చెరువులో చేపల పెంపకం

రాప్తాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మత్స్య సహకార సంఘం తరఫున గురువారం రాప్తాడు చెరువులో రెండు లక్షల చేప పిల్లలను వదిలారు. రాప్తాడు మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు జూటూరు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు మాదవయ్యల ఆధ్వర్యంలో చెరువులో చేప పిల్లలు వదిలారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం నాయకులు నాగభూషణం, రామ్మోహన్, మురళి, చిలక వెంకట్రాముడు, ఉప్పరపల్లి రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి



నృత్యం చేస్తున్న గొరవయ్యలు

రామగిరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరులో గురువారం కురుబ కులస్థుల ఆధ్వర్యంలో కనకదాస జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కనకదాస చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. మహిళలు జ్యోతులు, బోనాలు సమర్పించారు. గొరవయ్యల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదానం చేపట్టారు.

దుమ్ము.. ధూళితో ప్రయాణం

- గుంతల్లో వాహనదారులకు నరకం
- దారుణంగా కక్కలపల్లి రోడ్డు
- ఏళ్ల తరబడి మరమ్మతు పనులు చేపట్టని అధికారులు



పొగ మంచు కాదు.. దుమ్ము

అనంతపురం సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ గత ఐదేళ్ల పాలనలో రోడ్లను ఏమాత్రం పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులు చేయలేదు. తద్వారా ప్రధాన రహదారులు సైతం అధ్వానస్థితికి చేరి, ప్రజ లు అవస్థల నడుమ ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రధానంగా నగర శివారులోని రుద్రం పే ట సమీపంలో కక్కలపల్లి క్రాస్ నుంచి టమోటా మార్కెట్ (మండీ) మీదుగా కక్కలపల్లి వరకు వెళ్లే రహ దారి(ఆర్‌అండ్‌బీ) పూర్తిగా దెబ్బతింది. ఆ దారి గుండా ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తోందని ప్రజలు వాపోతు న్నారు. టమోటా మండీ నుంచి ఆదాయం ఉన్నప్ప టికి ప్రభుత్వం ఈ రోడ్డుపై దృష్టి పెట్టక పోవడం పలు విమర్శలకు తా విస్తోంది.





ముఖానికి చేతులు అడ్డంపెట్టుకుని వెళ్లాల్సిందే..

మరమ్మతులతోనే సరి పెడతారా..?

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్డు మరమ్మతు లకు కేవలం రూ.20లక్షలు మంజూరు చేసి మమ అనిపించింది. ఆ నిధులు సరిపోకపోవడంతో ఆర్ అండ్ బీ అధికారులు కొంతమేర సిమెంట్ రోడ్డు వేసి వదిలేశారు. నిత్యం టమోట్ మార్కెట్‌కు పెద్దఎత్తున వాహనాలు వస్తూ వెళ్తుండటంతో పాటు ఈ రోడ్డుపై ఇతర ప్రాంతాలకు చాలా వాహనాలు సంచరిస్తుంటాయి. దీంతో సుమారు 10 కి.మీ. మేర రోడ్డు ఆధ్వానంగా మారింది. కక్కలపల్లి క్రాస్ నుంచి టమోటా మండీ వరకు గుంతలమయమైన రోడ్డులో వాహన చోదకుల అవస్థలు వర్ణనాతీతం. నిత్యం దుమ్ము రేగుతూనే ఉంటుంది. పాదచారులు, ద్విచక్ర, ఇతర వాహనదారులు ముక్కు మూసుకుని ప్రయాణించాల్సి వస్తోంది. వర్షం వస్తే బురదమయమై.. ప్రమాదాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రోడ్డు మరమ్మతులకు రూ.40 లక్షలు నిధులు మంజూరు చేసింది. 90శాతం దెబ్బతిన్న ఆ రోడ్డును పూర్తిగా బాగుచేసేందుకు ఆ నిధులు సరిపోవు. మరమ్మతులకు కాకుండా శాశ్వతంగా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే మంచిదనే అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆ రోడ్డు పక్కన దుకాణాలు, హోటళ్లు నిర్వహిస్తున్న వారు, వినియోగదారుల పరిస్థితి దారుణంగా ఉంది.

గత ప్రభుత్వంలో పట్టించుకోలేదు



ఈ రోడ్డు అధ్వానంగా ఉండటంతో రాకపోకలు సా గించాలంటే నరకం కన బడుతోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏమాత్రం పట్టిం చుకోలేదు. కనీసం గుంతలు పూడ్చలేదు. టమో టా మండీ ఉండటంతో రద్దీ ఎక్కు వైంది. వర్షం వస్తే అంతే సంగతులు. గుంతల్లో నీరు చేరి అవస్థల నడుమ ప్రయాణం చేయాల్సిందే. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా జరిగాయి. ఈ రోడ్డు గుండా ఎవరైనా ప్రయాణం చేయాలంటే భయాందోళన చెందాల్సిన దుస్థితి. ఈ ప్రభుత్వమైనా శాశ్వత రోడ్డు ఏర్పాటు చేస్తే మంచింది.

- ఓబుళపతి, కక్కలపల్లి

ఇది రోడ్డా..?



దీన్ని రోడ్డు అంటారా.. చెప్పండి. కనీసం మరమ్మతులు కూడా చేయ కుండా ఏళ్ల తరబడి ప్రభుత్వాలు కాలయాపన చేయడం దారుణం. టమోటా మండీ నుంచి ఆదాయం వస్తున్నా.. పట్టించుకోకపోవడం అన్యా యం. వర్షం వచ్చినపుడు ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే సినిమా కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వమైనా ఈ రోడ్డును శాశ్వితంగా వేసి ప్రయాణికులకు సురక్షిత ప్రయాణం ఉండేలా చూడాలి. వీటికితోడు దుమ్ము ఎక్కువగా రావడంతో అనేకమంది ఆనారోగ్యం బారిన పడుతున్నారు. మాకు కూడా ఇదే సమస్య ఉంది.

- మద్దన్న, నారాయణమ్మ దంపతులు, కక్కలపల్లి

మరమ్మతులకు టెండర్ పూర్తయింది

. ఈ రోడ్డు ఎక్కువగా దెబ్బతిన్న మాట వాస్తవమే. గత ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపాం. మరమ్మతులకు మాత్రమే నిధులు అప్పట్లో వచ్చాయి. ప్రస్తుత ప్రభుత్వం కూడా అధికారంలోకి రాగానే. స్పందించి మరమ్మతులకు రూ.40 లక్షలు నిధులు మంజూరు చేసింది. శాశ్వత రోడ్డుకు సంబంధించిన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపాం. భవిష్యత్‌లో నిధులు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం అతి త్వరలో మరమ్మతులు చేయనున్నాం. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది.

- బాలకాటమయ్య, డీఈఈ, ఆర్‌అండ్‌బీ

విద్యార్థి జీవితంలో పది కీలకం: డీఈఓ



పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పదో తరగతి కీలకమని, విద్యార్థులు పరీక్షల్లో ప్రతిభ చూపి మంచి ఫలితాలు సాధించాలని డీఈఓ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని నేతాజీ మున్సిపల్ స్కూల్‌లో ఆర్‌జేయూపీ జిల్లా ప్రధానకార్యదర్శి, తెలుగు స్కూల్ అసిస్టెంట్ రామాంజినేయులు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన తెలుగు మెటీరియల్‌ను డీఈఓ ప్రసాద్ బాబు, ప్రధానోపాధ్యాయులు ప్రకాష్‌రావు చేతుల మీదుగా గురువారం విద్యార్థులకు అందజేశారు. ఆర్‌జేయూపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, తెలుగు స్కూల్ అసిస్టెంట్ దేవరకొండ రామాంజినేయులను డీఈఓ అభినందించారు. కార్యక్రమంలో టీచర్లు లక్ష్మి, సుజాత, సుభాషిణి, రాధా తదితరులు పాల్గొన్నారు.

● రామగిరి: పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు శ్రద్ధ చూపాలని డీఈఓ పేర్కొన్నారు. ఆయన గురువారం సాయం త్రం మండలంలోని నసనకోట, కుంటిమద్ది ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పదో తరగతి విద్యార్థులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈఓ శ్రీనివాసులు ఉన్నారు.

విధులు బహిష్కరించి కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏటీఎం నాగరాజు, నాగభూషణ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించారు. నగరంలోని ఆరు సర్కిళ్ల పరిధిలో పనిచేస్తున్న కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు. తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు విధుల్లోకి చేరే ప్రసక్తే లేదన్నారు.

పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్రం: సీఐటీయూ

అనంతపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజి నేయులు అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, పలు డిమాండ్లపై ఈ నెల ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాకు సంబంధించిన కరపత్రాలను గురువారం మండలంలోని ఐఎంఎల్ డిపో ఎదుట విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మోహన్‌రెడ్డి, తిరుపాలు, ఐఎంఎల్ డిపో మేస్త్రి నాగార్జున, ఆంజనేయులు, లక్ష్మినారాయణ, సంగప్ప, ప్రకాష్, పెద్దన్న, వేణు, నంద, నల్లప్ప, నాగేంద్ర, రామ కొండ, సురేష్, రాము పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చోరీలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ

అనంతపురం టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆస్పత్రిలో ఇటీవల జరుగుతున్న దొంగతనాలపై ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని టుటౌన్ సీఐ శ్రీకాంత్ సూచించారు. ఆయన గురువారం ఆస్పత్రిలో పర్యటిస్తూ వైద్యాధికారులు, సెక్యూరిటీ సిబ్బందితో దొంగతనాలపై ఆరాతీశారు. సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండడంవల్లనే ఆస్పత్రిలో దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులు, వారి బంధువులతో సీఐ మాట్లాడుతూ అనుమానితులు కనిపించిన వెంటనే సెక్యూరిటీకి, ఆస్పత్రి ఆవరణంలో ఉన్న పోలీస్‌ల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టరు హేమలత, డిప్యూటీ ఆర్ఎంఓ పద్మజ సెక్యూరిటీలు పాల్గొన్నారు.

సకాలంలో రోడ్డు పనులు పూర్తి చేయండి: జేసీ



బండమీదపల్లిలో పరిశీలిస్తున్న జేసీ

శింగనమల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎన్‌హెచ్ 544డి రోడ్డు పనులను సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ సూచించారు. ఆయన గురువారం మండలంలోని చక్రాయపేట, శివపురం, మరవకొమ్మ, పెరవలి, సి.బండమీదపల్లి నాయనపల్లి క్రాస్ వరకు జరుగుతున్న ఎన్‌హెచ్ 544డి రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వేగవంతంగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే రోడ్డు కోసం భూములు కోల్పోతున్న నిర్వాసితులతో మాట్లాడారు. వారి అనుమానాలను నివృత్తి చేశామని , భూసేకరణలో మిస్సయిన భూముల వివరాలపై వెంటనే ప్రతిపాదనలు పంపాలని తహసీల్దార్లను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాకేబ్రహ్మయ్య సర్వేయర్ స్టీఫెన్ ఆర్ఐ హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

దళిత ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

అనంతపురం విద్య, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలువురు దళిత ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎంఈఎఫ్ నాయకులు డీఈఓ ప్రసాద్‌బాబును కోరారు. ఆసంఘం జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి శంకర్, ఇతర సంఘాల నేతలు డీఈఓను ఆయన చాంబర్‌లో గురువారం కలిశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.... ఇటీవల సమగ్రశిక్ష నుంచి రిలీవ్ అయిన మహేశ్వరి పలు సమస్యలతో సతమతమవుతున్నారని, మానవతా దృక్పథంతో ఆమెకు గుత్తి జిల్లాపరిషత్ హైస్కూల్‌కు పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. తరిమెల జడ్పీహైస్కూల్‌లో పనిచేస్తున్న వేమ నారాయణను కదిరి పట్టణ సమీపంలోని స్కూల్‌కు డిప్యూటేషన్ వేయాలని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుప్రసాద్, రమేష్, ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇద్దరిని తప్పించండి: టీఎన్‌యూఎస్

అనంతపురం విద్య, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న ఏపీఓ, ఏఎస్ఓలను వెంటనే తొలగించి కొత్తవారికి అవకాశం కల్పించాలని టీఎన్‌యూఎస్ నాయకులు కోరారు. ఆ సంఘం నాయకులు గురువారం డీఈఓను ఆయన చాంబర్లో కలిశారు. ఇటీవల ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినట్లు అవకతవకలు జరిగాయన్నారు. సమగ్రశిక్ష ప్రాజక్టులో సైతం గతంలో పనిచేసిన వారిని తొలగించి కొత్తవారికి ఇవ్వాలన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం: సీపీఎం

శింగనమల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రజాసమస్యలు పరిష్కరించే వరకు పోరాటలు చేస్తామని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు.సిపిఎం పార్టీ ఆద్యర్యంలో రైతాంగ కార్మిక వ్యతిరేక విధానాలపై చేపట్టిన జీపుయాత్ర గురువారం రాత్రి శింగనమల చేరింది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్ కృష్ణమూర్తి బాస్కర్ తదితరులు పాల్గోన్నారు.

పండమేరు వంకలో మట్టి రోడ్డు ఏర్పాటు

రాప్తాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో రాప్తాడు నుంచి చిన్మయ్‌నగర్‌కు వెళ్లే దారిలో మట్టిరోడ్డు ఏర్పాటు చేశారు. రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు రోడ్డుకు మట్టి తోలించి చదును చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ గురువారం మాట్లాడుతూ రాప్తాడు నుంచి చిన్మయ్‌నగర్‌కు వెళ్లే దారి ఇటీవల కురిసిన భారీ వర్షానికి కోతకు గురైందని, దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేదన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వెంటనే రోడ్డుకు మట్టి తోలించి చదును చేసి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చేశామన్నారు. పండమేరు వంకపై బ్రిడ్జి నిర్మించి వాహన సంచారానికి అంతరాయం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.



మట్టిరోడ్డు వేయిస్తున్న సర్పంచ్ తిరుపాలు

సీపీఐలోకి వంద కుటుంబాలు

● జిల్లా కార్యదర్శి జాఫర్

అనంతపురం విద్య, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ లోకి అభ్యుదయ కాలనీకి చెందిన వంద కుటుంబాల సభ్యులు చేరారని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన వారికి కండువాలు కప్పు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాఫర్ మా టాడుతూ.. పేదలు, కష్టజీవుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. మరో వంద ఏళ్లైనా.... అజేయంగా నిలస్తుందని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శి రమణ, ఇతర నేతలు లింగమయ్య, రమణయ్య, అల్లిపీరా, సంతోష్‌కుమార్, చాంద్‌బాషా, మున్నా, రాజు, నాగప్ప, లక్ష్మినారాయణ,నాగభూషణం, పద్మ పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

● సీఎం చంద్రంబాబును కోరిన ఎమ్మెల్యే దగ్గుపాటి



సీఎంకు విన్నవిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అనంత నగరం అభివృద్ధికి తగిన నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కోరారు. ఆయన గురువారం అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతపురం నగరంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం సాయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. భారీ వర్షాలు వచ్చినప్పుడు నడిమి వంక, మరువ వంక పరిసర ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆ వంకల ఇరువైపుల ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించాల్సి ఉందని, అందుకు రూ.86 కోట్లతో నివేదికలు సిద్ధం చేశామన్నారు. నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతలోని డంపింగ్ యార్డును ఇతర ప్రాంతానికి తరలించేందుకు స్థల కేటాయింపుతోపాటు నిధులు ఇవ్వాలని కోరారు. ఇందుకు సీఎం స్పందిస్తూ.. ప్రాధాన్యత వారీగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే అర్బన్ నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వం నమోదుపైనా సీఎం చర్చించారు.

మంత్రులకు వినతులు

● నిధులివ్వాలని కోరిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



రెవెన్యూ మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సంబంధిత మంత్రులకు విన్నవించా రు. ఆమె గురువారం అసెంబ్లీ సమావేశం అనంతరం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, దేవదాయ శాఖ మంత్రి అనం నారాయనరెడ్డిని కలిశారు. నియోజకవర్గంలో ఆ శాఖలకు సంబంధించిన సమస్యలను వారికి వివరించారు. నియోజకవర్గంలో చాల కాలనీల్లో పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని తెలిపారు. అలాగే ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి గ్రామస్థులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద నిధు లు మంజూరు చేయాలని కోరారు. బీసీ, ఎస్సీ సంక్షేమ పాఠశాలు, వసతిగృహాల్లో మౌలిక సదుపాయలకు నిధులు ఇవ్వాలని కోరారు. అలాగే కుళ్లాయిస్వామి కొలువుదీరిన గూగూడు ను పుణ్య క్షేత్రంగా గుర్తించి ఆలయం అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలన్నారు అలాగే నియోజకవర్గంలోని కరువు మండలాలకు కేంద్ర, రాష్ట్ర నిధులను కేటాయించాలని, అలాగే సాగు, తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ వినతులపై ఆయా మంత్రులు సానూకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

జాతీయ క్రికెట్ పోటీల్లో చక్రిక ప్రతిభ

● మహారాష్ట్రపై ఆంధ్రా జట్టు విజయం



చక్రిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రికెట్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి చక్రిక తన చతురతను చాటుకుంది. భువనేశ్వర్‌లో గురువారం అండర్-15 బీసీసీఐ బాలికల జాతీయ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆంధ్రా-15 బాలికల జట్టు, మహారాష్ట్ర -15 బాలికల జట్లు తలపడ్డాయి. ఇందులో మొదటి బ్యాటింగ్ చేసిన ఆంధ్రా జట్టు 35ఓవర్లలో 7వికెట్లకు 193పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన మహారాష్ట్ర 30ఓవర్లలో 111పరుగులకు ఆలౌట్ అయ్యింది. జిల్లాకు చెందిన బౌలర్ చక్రిక 3వికెట్లు తీసి ఆంధ్రా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. ఉత్తమ ప్రతిభతో ఆకట్టుకున్న చక్రికు జిల్లా క్రికెట్ సంఘం ఇంచార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆత్మకూరు విద్యార్థులు



ఎంపికైన కళాశాల విద్యార్థులు

ఆత్మకూరు నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ అండర్ - 19 క్రికెట్ పోటీలకు ఎంపికయినట్లు కళాశాల పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పీటీసీ గ్రౌండులో జరిగిన అండర్ - 19 ఎంపిక పోటీల్లోలో ఆర్ మదన్‌మోహన్ రెడ్డి, శ్రీనాథ్, పి అక్షయరెడ్డి మంచి ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు పేర్కొన్నారు. వారిని కళాశాల ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. ఆర్‌డీటీ క్రికెట్ కోచ్ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

పండు ఈగ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

అనంతపురం అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల్లో పంట పక్వానికి వచ్చే సమయంలో దిగుబడిని తగ్గించే పండు ఈగ నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జాతీయ మొక్కల యాజమాన్య సంస్థ అసిస్టెంట్ డైరె క్టర్ ప్యాల జ్యోతి సూచించారు. స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో గురువారం 'పండు ఈగ నివారణ-విదేశాలకు ఉద్యాన పంటల ఎగుమతి పెంపు' అనే అంశంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఈడీఏ బిజినెస్ డెవలప్ మెంట్ మేనేజర్ పెద్దస్వామి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ

గుత్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో గురువారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐగా మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేస్తున్న శివసాగర్ గుంతకల్లుకు బదిలీ అయ్యారు.. ఆయన స్థానంలోకి మడకశిర మొబైల్ ఎక్సైజ్ సీఐగా ఉన్న మోహన్‌రెడ్డి వచ్చారు.

జీఓ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలి

గుంతకల్లు టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు జీఓ నెంబరు 36ప్రకారం వేతనాలు చెల్లించాలని ఇంజనీరింగ్ కార్మికుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్‌గా విభజించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సురేష్, మల్లేష్, మస్తాన్, ఓంకార్, రాజేష్, సూరివర్థన్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

గుంతకల్లు టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల్లో ఏపీటీఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదును గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ.. పట్టణంలోని 33ప్రాథమిక పాఠశాలలు, 4ఉన్నత పాఠశాలలో 146 మంది ఉపాధ్యాయులు సభ్యత్వం పొందారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నారాయణకుమార్, పట్టణ అధ్యక్షుడు ఉదయ్‌భాస్కర్, ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, కోశాధికారి లాలెప్ప, సభ్యులు పాల్గొన్నారు.

రేపు కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

గుంతకల్లు టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజేంద్రప్రసాద్ ఉన్నతపాఠశాలలో ఈనెల 23న ఉమ్మడి అనంతపురం జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు డిసెంబరు 5నుంచి 8వ తేదీ వర కు ప్రకాశం జిల్లా సంతనూతనపాడులో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 9441053041, 9966224669 సంప్రదించాలన్నారు.

ఏపీఐఐసీ భూముల పరిశీలన

కూడేరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపంలోని 535 సర్వేనంబర్‌లో ఏపీఐఐసీకి కేటాయించిన భూమిని ఆర్డీఓ కేశవనాయుడు గురువారం పరిశీలించారు. ప్రభుత్వం ఏపీఐఐసీకి 350 ఎకరాల భూమిని కేటాయించింది. ఆర్డీఓ వాటిని పరిశీలించి సంబంధిత రైతులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే పరిశ్రమలు వచ్చే అవకాశం ఉండటంతో ఉన్నతాధికారులు త్వరితగతిన రహదారితోపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ తెలిపారు. తహసీల్దారు మహబూబ్‌బాషా, సర్వేయర్ ఆయేష్ సిద్దిఖి, డీటీ సూర్యప్రకాష్, వీఆర్ఓ రమేష్ తదితరులున్నారు.

తాగునీటి పథకాల పరిశీలన

కూడేరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఏబీఆర్ డ్యాంలో నీటి శుద్ధి కేంద్రాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ గురువారం పరిశీలించారు. సత్యసాయి, ఉరవకొండ, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాలను పరిశీలించి తాగునీటి గూర్చి స్థానిక అధికారులకు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పశు సంపద పెరగాలి

కూడేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పశు సంపద తగ్గకుండా మరింత పెరిగే విధంగా ప్రభుత్వం మినీ గోకులం షెడ్ల పథకం ప్రవేశపెట్టిందని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటస్వామి పేర్కొన్నారు. మండలంలోని ఉదిరిపికొండ, ఉదిరిపికొండ తండా గ్రామాల్లో నిర్మిస్తున్న మినీ గోకులం షెడ్లను జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటస్వామి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెటర్నరీ డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధ్వానంగా పీఏబీఆర్ కుడికాలువ

- ఏపుగా పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్కలు
- నీటి ప్రవాహానికి అడ్డంకి..
- త్వరలో నీటి విడుదలకు సన్నాహాలు

కూడేరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పెన్న అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కుడి కాలువకు త్వరలో నీరు విడుదల చేయనున్నారు. అయితే ఆ కాలువలో కంపచెట్లు, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయి అధ్వానంగా ఉంది. దీంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారే పరిస్థితి నెలకొంది. పీఏబీఆర్ కూడేరు, గార్లదిన్నె, రాప్తాడు, ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి తదితర మండలాల్లోని దాదాపు 49 చెరువులకు నీరు అందించేందుకు ఇరిగేషన్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 3.113 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కుడి కాలువకు నీరు వదలాలంటే ఒకటిన్నర టీఎంసీలపైన నిల్వ ఉండాలి. ప్రస్తుతం ఎక్కువగానే నిల్వ ఉండటం వల్ల నీటిని వదిలేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కాగా కాలువలో ఇరువైపులా చెట్లు పెరిగిపోవడంతో పాటు డ్యాం నుంచి పదో కిలోమీటర్ వరకు కాలువ మధ్యలో గడ్డి పెద్దఎత్తున పెరిగిపోయింది. వాటిని శుభ్రం చేయకపోతే నీటి ప్రవాహానికి అవి అడ్డంకిగా మారే పరిస్థితి కనిపిస్తోంది. కాలువలో పెరుకుపోయిన గడ్డి, కంపలు, పిచ్చి మొక్కలు శుభ్రం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


కంపచెట్లు, పిచ్చి మొక్కలతో నిండిఉన్న కుడి కాలువ

ఎడారి నివారణకు ప్రత్యేక నిధులివ్వండి


అసెంబ్లీలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు.

రాయదుర్గం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శరవేగంగా విస్తరిస్తోన్న ఎడారీకరణను నివారించడానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. అమరావతిలోని అసెంబ్లీలో గురువారం ఉదయం ఆయన ప్రశ్నోత్తరాల సమయంలో ఎడారీకరణ నివారణ గురించి మాట్లాడారు. అనంతపురం జిల్లాలో రాయదుర్గం నియోజకవర్గం అత్యంత వెనుకబడిన ప్రాంతమన్నారు. జైసల్మేర్ తర్వాత అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం రాయదుర్గమన్నారు. ఈ నియోజకవర్గంలో 20 వేల ఎకరాల్లో ఇప్పటికే ఎడారి ఛాయలు అలముకున్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఎడారి దృశ్యాలను గతంలో సినిమాల్లో కూడా షూట్ చేశారని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాలకు కేంద్రం నుంచి అందే నిధుల్లో రాయదుర్గం నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రోడ్ల నిర్మాణానికి నిధులివ్వండి


అసెంబ్లీలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని 108 వాహనం వెళ్లేందుకు కూడా వీలులేని విధంగా పాడయ్యాయని, దీంతో గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కోరారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అభివృద్ధి పథంలో నడిపించేందుకు తగిన మొత్తంలో నిధులు ఇవ్వాలని ఆయా శాఖల మంత్రులను కోరారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం అత్యంత వెనుకబడినప్రాంతమని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. తాగునీటి సమస్యను తీర్చేందుకు ప్రత్యేక నిధులను కేటాయించాలని అన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు.

రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి: సీఐటీయూ

తాడిపత్రి/ యాడికి/ పెద్దవడుగూరు/ గుత్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు, కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్ కోరారు. సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన జీపు జాతా గురువారం తాడిపత్రికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులు పండించిన అన్ని పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని తెలిపారు. అలాగే విద్యుత్ సవరణ బిల్లు 2022ను రద్దు చేయాలని, రైతులకు అన్నిరకాల రుణాలు మాఫీ చేయాలని, ఉపాధి పనిదినాలను 200రోజులకు పెంచాలని, రోజువారి వేతనం రూ.600 చేయాలని , పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 26వ తేదీన కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, సూరి, శ్రీనివాసులు, జగన్‌మోహన్‌రెడ్డి, అంజి, నాగరాజు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు. అలాగే యాడికి, పెద్దవడుగూరు, గుత్తి మండలకేంద్రాల్లోనూ సీఐటీయూ నాయకులు జీపు జాతా నిర్వహించారు. ఇందులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు సూరి, ఏఐకేఎఫ్ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.


తాడిపత్రిలోని జీపుజాతాలో మాట్లాడుతున్న నాయకులు

ప్రతి రైతూ బీమా ప్రీమియం చెల్లించాలి: జేడీఏ

రాయదుర్గం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో బోరుబావుల కింద పంటలు సాగుచేసే ప్రతి రైతు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని, ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ అధికారులకు సూచించారు. మండలంలోని 74 ఉడేగోళం గ్రామ రైతుసేవా కేంద్రంలో గురువారం ఆమె ఐదు మండలాల వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం పొందాలంటే తప్పనిసరిగా ప్రీమియం చెల్లించాలని సూచించారు. శనగపప్పునకు ఎకరానికి రూ. 450, మొక్కజొన్నకు రూ. 525, వరికి రూ. 630, వేరుశనగకు రూ. 480, జొన్నకు రూ. 315 ల చొప్పున ప్రీమియంను దగ్గరలో ఉన్న రైతుసేవ కేంద్రంలో చెల్లించాలని తెలిపారు. తుఫాన్ ఉన్నందున ఈ నెల 26 నుంచి 28వ తేదీ మధ్యలో రైతులు ఎవరూ వరి కోతలు కోయకుండా జాగ్రత్త వహించాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఐదు మండలాల వ్యవసాయ అధికారులతో పాటు సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ రైతు సేవా కేంద్రాల సిబ్బందికి, ఉద్యానవన సహాయకులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు అన్ని వేళల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో వస్తున్న కొత్త టెక్నాలజీలను సకాలంలో రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు జగదీష్, పృథ్వీసాగర్, సరిత, మహేష్, జాఫర్ బాషా, ఏఈఓలు ఆరు మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌కు సన్మానం

రాయదుర్గం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ బోర్డు రాయలసీమ(కడప) జోనల్ చైర్మన్‌గా నియమితులైన జడ్పీ మాజీ చైర్మన్, టీడీపీ వాల్మీకి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పూల నాగరాజును ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ డిపో కార్యదర్శి తిప్పేస్వామి, నూతన డీఎం శ్రీనివాసులు గురువారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసిస్టెంట్ సెక్రెటరీ ఎస్ నాగరాజు, జోనల్ ఉపాధ్యక్షులు ఎంఎండీ షఫీ, డిపో కార్యదర్శి హెచ్ తిప్పేస్వామి, రీజనల్ నాయకులు ఎన్ దామమ ఓడార్, రామాంజినేయులు, కరిబసప్ప, యూఎల్ నారాయణ, ఎస్ షైలారప్ప, శివనాగ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన దర్గా

బొమ్మనహాళ్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహోన్నూరు గ్రామంలో హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన సయ్యద్ సర్మాస్ వలి చిష్టీ ఉరుసు ఉత్సవాలు గురువారం భక్తులతో వైభవంగా జరిగాయి. దర్గా పీఠాధిపతి ముతావలి సయ్యద్‌షా రహంతుల్లా దర్గాలో విశేష ప్రార్థనలు నిర్వహించారు. తర్వాత దర్గాలోని స్వామి సమాధికి నూతన చాదర్ సమర్పించి ప్రార్థనలు జరిపారు. గురువా రం ఉరిసే షరీఫ్ షంషేర్ కార్యక్రమం నిర్వహించారు. ఆం ధ్ర, కర్ణాటక ప్రాంతా ల నుండి వేలాదిమంది తరలివచ్చి దర్గాలో చక్కెర చదివింపులు చేయించా రు. ఉరుసు ఉత్సవాలకు ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ దర్గాను సందర్శించి స్వామి వారి సమాధిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప, ఆర్గనైజ్ సెక్రెటరీ నాగరాజు, రవిచంద్ర, ముక్కన్న, మాజీ కో ఆప్షన్ సభ్యులు సర్మస్‌వలి, వీఎల్ రామాంజినేయులు, మహమ్మద్ రఫీ, కేపీ వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో కిక్కిరిసిన దర్గా

ఫసల్ బీమాను వినియోగించుకోండి

పుట్లూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో రబీలో సాగుచేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన చెల్లించి సద్వినియోగం చేసుకోవాలని గురువారం మండల వ్యవసాయ అధికారి కాత్యాయిని తెలిపారు. పంటలకు బీమా చెల్లిస్తే ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. పప్పుశనగకు ఎకరాకు రూ.450, మొక్కజొన్నకు రూ.524, వేరుశనగకు రూ.480, జొన్నకు రూ.315, వరికి రూ.630 చెల్లించాలన్నారు. డిసెంబరు 15లోగా డీడీలు చెల్లించాలన్నారు. పూర్తివివరాల కోసం వ్యవసాయ, రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలని ఆమె కోరారు.

ఘనంగా గౌరమ్మ రథోత్సవం

విడపనకల్లు నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి గ్రామంలో గౌరమ్మదేవి రథోత్సవ వేడుకలు గురువారం ఘనంగా ముగిశాయి. మూడు రోజులుగా గ్రామంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు కార్తీక మాసంలో అమ్మవారి ప్రతిమను తయారు చేసి కొలువుదీర్చి పూజలు చేశారు. బుధవారం రాత్రి అమ్మవారికి మహా మంగళ హారతులు నిర్వహించి గురువారం తెల్లవారు జామున పూల రథంలో కొలువు దీర్చారు. అనంతరం గ్రామ వీధుల్లో ఊరేగించారు. తర్వాత గ్రామ చివరన ఉన్న చెరువులో అమ్మవారిని నిమజ్జనం చేయటంతో వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


పూల రథంలో ఊరేగుతున్న గౌరమ్మ

నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

యాడికి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపేట గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులపై బుధవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరమణయ్య తెలిపారు. పెద్దపేట గ్రామానికి చెందిన అంజినమ్మ అనే మహిళను కిరాణా దుకాణం వద్ద అదే గ్రామానికి చెందిన నాగార్జున, జయరాముడు, సుదర్శన్, రంగస్వామి కులంపేరుతో దూషించారన్నారు. అంజినమ్మ ఫిర్యాదు మేరకు నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు వ్యాపారులతో సమావేశం

తాడిపత్రి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 21న సాయంత్రం 4గంటలకు చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీస్టాల్స్, టిఫెన్ హోటళ్లు, డాబాలు, రెస్టారెంట్ల వ్యాపారులతో సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ శివరామకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి వ్యాపారులు తప్పక హాజరుకావాలని ఆయన సూచించారు.

బొప్పాయి చెట్ల నరికివేత

కుందుర్పి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అపిలేపల్లి గ్రామంలో దాక్షాయని అనే మహిళా రైతుకు చెందిన తోటలో బొప్పాయి చెట్లను బుధవారం రాత్రి దుండగులు నరికివేశారు. దాక్షాయణి గురువారం తోటకు వెళ్లి చూసే సరికి బొప్పాయి చెట్లను నరికివేతకు గురై, కాయలు ధ్వంసమై పడి ఉన్నాయి. దీంతో మహిళా రైతు వెంటనే మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో అనుమానితులపై ఫిర్యాదు చేసింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. తర్వాత ఆమె సమీప బంధువులైన హనుమంతరాయుడు, ఆదినారాయణలను గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు.

రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ

గుంతకల్లుటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అరవిందనగర్ రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి డేవిడ్ ఇంట్లో చోరీ జరిగింది. డేవిడ్ పట్టణంలోని రైల్వే డీజిల్ షెడ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. కాగా అతను ఈనెల 16వ తేదీన ఇంటికి తాళం వేసి కర్నూలులో బంధువుల ఇంటికి వెళ్లాడు. గురువారం తిరిగి వచ్చి వచ్చిచూడగా ఇంటి తాళాలు పగిలిపోయి కనిపించాయి. లోపలికి వెళ్లి చూడగా.. బీరువా కూడా పగిలిపోయి ఉంది. అందులోని నాలుగు తులాల బంగారు నగలు, రూ.10వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించిన ఆయన వెంటనే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ప్రమాద స్థలాల పరిశీలన

తాడిపత్రి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపల్లి, చుక్కలూరురోడ్డు, కడపరోడ్డు, నంద్యాలరోడ్డులలో తరచుగా ప్రమాదాలు జరిగే స్థలాలను డీఎస్పీ రామకృష్ణుడు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తరచుగా ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించామన్నారు. భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనదారులు అధికస్పీడుతో వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బొమ్మనహాళ్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్,రంగాపురంక్యాంప్ గ్రామాల మధ్యలో బళ్లారి - కళ్యాణదుర్గం రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. మండలంలోని కొళగానహళ్లి గ్రామానికి చెందిన క్యాంపు లక్ష్మి(40) ఆరోగ్యం బాగలేకపోతే గురువారం ఉద్దేహాళ్ లోని ఆసుపత్రికి ఆటోలో బయలుదేరింది. అయితే ఉద్దేహాళ్, రంగాపురంక్యాంప్ గ్రామాల మధ్యలోకి రాగానే ఆటో ప్రమాదవశాత్తూ బోల్తా కొట్టింది. ప్రమాదంలో క్యాంపు లక్ష్మి కిందపడి తీవ్ర గాయాలపాలైంది. స్థానికులు 108లో బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆస్పత్రికి చేరుకోగానే ఆమె మృతి చెందింది. ఈ ప్రమాదంపై పోలీసులు విచారిస్తున్నారు.

ఓటరుగా నమోదు చేయించుకోవాలి

రాయదుర్గం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23, 24 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజు గురువారం ప్రకటనలో తెలిపారు. రెండురోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారన్నారు. 18 సంవత్సరాల వయసు నిండిన యువత ఓటుహక్కును పొందేందుకు అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఓటరు కార్డులో చేర్పులు, మార్పులు ఉంటే కూడా సరి చేసుకోవచ్చన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి

తాడిపత్రి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రామాంజనేయులు గురువారం కమిషనర్ శివరామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో దాదాపు 25ఏళ్లుగా వివిధ భాగాల్లో కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కానీ గుర్తింపు లేకుండా చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులకు పారిశుద్ధ్య కార్మికుల మాదిరిగానే జీవో నెం. 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఇంజనీరింగ్ విభాగం ఉపాధ్యక్షుడు జుబేరా, మహబూబ్‌బాషా, ప్రసాద్, కార్మికులు రాము, శేఖర్ పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులకు శిక్షణ

రాయదుర్గం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఎన్నికలు నిర్వహించే అధికారులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు గురువారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ని మద్దానేశ్వరస్వామి ఆలయంలో శిక్షణ ఏర్పాటు చే శార ని, ఎన్నికల అధికారులు సిబ్బంది హాజరుకావాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: జేసీపీఆర్


మొక్కను నాటుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

పెద్దపప్పూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాట సంరక్షించాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సూచించారు. మండలంలోని తిమ్మనచెరువులో వెలసిన వజ్రగిరి లక్ష్మినరసింహస్వామి ఆలయ ఆవరణలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఇందులో జేసీ ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి మొక్కలు నాటి సంరక్షించడమే ఏకైక మార్గమన్నారు. నాటిన మొక్కలకు ప్రతిరోజూ నీరు పోయడానికి ప్రత్యేకంగా ట్యాంక్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, నాయకులు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ గుర్రి రఘునాయుడు, భాస్కర్‌రెడ్డితో పాటు తహశీల్దార్ బాలాజీరాజు, ఎంపీడీఓ శకుంతల తదితరులు ఉన్నారు.

భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం


రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

పుట్లూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారికి భూములు పోయి నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తెలిపారు. మండలంలోని ఏ. కొండాపురం గ్రామంలో గురువారం ఆయన ఆర్డీఓ కేశవనాయుడుతో కలిసి భూములు కోల్పోయిన రైతులతో మాట్లాడారు. పరిహారం మంజూరుకు పలువురిని విచారించారు. అరకటవేముల రెవెన్యూలో నష్టపోయిన రైతుల జాబితాపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ శేషారెడ్డి, సర్వేయర్ శాంతి ఉన్నారు.

ఫ్లడ్ డ్యామేజ్ పనుల పరిశీలన


హెచ్చెల్సీ అధికారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

కణేకల్లు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ సబ్ డివిజన్‌లో అత్యవసరం కింద చేపడుతున్న ఫ్లడ్ డ్యామేజీ పనులను అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న గురువారం పరిశీలించారు. హెచ్చెల్సీ ఆంధ్ర సరిహద్దు 105 కి.మీ నుంచి 189 కి.మీ వరకు గతంలో ప్రవాహానికి ముందు చేసిన పలు అత్యవసర పనులను గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే తుంగభద్ర డ్యాం నుండి ఆంధ్రకు వస్తున్న నీటి వాటా గురించి తెలుసుకోవడంతో పాటు వాటిలో ఇంతవరకు నీటిని మనం వాడుకున్నామా లేదా అనే విషయాన్ని కనుక్కున్నారు. తాగునీటికి ఎంతమేర నీటిని కేటాయించారో వాటి ద్వారా ఏ ప్రాంతాలకు హెచ్చెల్సీ నీరు తాగేందుకు ఉపయోగించుకుంటున్నారో అనే విషయాన్ని కూడా ఆమె ఆరా తీశారు. అనంతరం హెచ్చెల్సీ అధికారులు సమీక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ డీఈ మద్దిలేటి, ఏఈలు నరేంద్ర, మారుతి, గోపాల్‌నాయక్, నసీరుద్దీన్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


రూ. 50 వేల నగదు అందజేస్తున్న అవినాష్

కళ్యాణదుర్గం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బొజ్జన్న యాదవ్ నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకుడు దేవినేని అవినాష్ గురువారం మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యుల్ని పరామర్శించారు. అనంతరం రూ. 50 వేల ఆర్థిక సాయం చేశారు. అనంతరం ఆయన అదే రూ. రెండు కోట్ల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

బాధితురాలికి ఆర్థిక సాయం


మల్లిక తల్లిదండ్రులకు నగదును అందజేస్తున్న సమితి సభ్యులు

గుంతకల్లు టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పట్టణానికి చెందిన మల్లిక కుటుంబానికి స్థానిక ముస్లిం ప్రజా హక్కుల పోరాట సమితి సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. మల్లిక 15 రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇందుకు గాను తమ వంతు సాయంగా రూ.42వేలను గురువారం వారు పట్టణంలోని ఆమె ఇంటికెళ్లి తల్లిదండ్రులకు అందజేశారు. మల్లిక త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సభ్యులు ఆరీఫ్, హమీద్‌సాబ్, గుజరిఖాజా, రహంతుల్లా, పూలరసూల్, సయ్యద్ అమీర్, వలి బాషా, ఫజులు తదితరులు పాల్గొన్నారు.